Follow: @ANNTELUGU

17-05-2025

ANN తెలుగు

# మహా పత్రిక

శనివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 164 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## హాస్పిటల్‌లో అందగత్తెలు

**ఏఐజీ హాస్పిటల్, పిల్లలమర్రి, ఎక్స్‌పీరియం ఎకో పార్క్ సందర్శన**

చికిత్స పొందుతున్న చిన్నారులు, వృద్ధులతో ఆత్మీయంగా పలకరింపులు

అనంతరం పిల్లలమర్రి, ఎక్స్‌పీరియం ఎకో పార్క్ విజిట్

సేంద్రీయ వ్యవసాయ పద్ధతులపై అవగాహన

గద్వాల పట్టు చీరలు, వాటి ప్రత్యేక నేత పద్ధతులు వీక్షించిన ముద్దుగుమ్మలు

వివరాలు 3లో

**టాప్ న్యూస్**



## రేపో మాపో చెల్లి రాజీనామా

- అందుకే పిచ్చోడిలా కేటీఆర్ మాటలు
- మంత్రి సీతక్క వ్యాఖ్యలు


02



## నేనట్ల అనలే

- నా వ్యాఖ్యలను పూర్తిగా వక్రీకరించారు
- ఈ ప్రభుత్వం కాదు.. బీఆర్ఎస్ ప్రభుత్వంలోని మంత్రులపై మాట్లాడాను
- చిన్న క్లిప్ కట్ చేసి బీఆర్ఎస్ పెయిడ్ బ్యాచ్ ప్రచారం చేస్తోంది
- మంత్రులు డబ్బు వసూలు వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ క్లారిటీ

02



## పవన్ ఫ్యాన్స్ బీ రెడీ

- డిప్యూటీ సీఎం సినిమా రిలీజ్ డేట్ ఫిక్స్
- జూన్ 12న హరిహరవీరమల్లు

03



హరీష్ రావు కొత్త రాజకీయ
## పార్టీ ప్రచారం

- అందుకే కేటీఆర్ హుటాహుటిన ఆయన ఇంటికి
- ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్ వ్యాఖ్యలు

వివరాలు 3లో



## ఆదిభట్లలో గంజాయి చాక్లెట్ల కలకలం

- ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో విక్రయం
- 810 గ్రాముల గంజాయి చాక్లెట్లు స్వాధీనం
- ఇద్దరు నిందితుల అరెస్టు రిమాండ్

వివరాలు 3లో



# హరీశ్ ఇంటికి వెళ్లిన కేటీఆర్

## రెండు గంటల పాటు కీలక చర్చలు

**కవిత వ్యవహారశైలిపైనే ప్రధాన చర్చ**

పార్టీలో తన బాధ్యత ఏంటో తేల్చమని వార్నింగ్ ఇచ్చిన కవిత

వరుసగా తనను అవమానిస్తున్నారన్న ఆవేదనలో కవిత

ప్రాధాన్యం లేకుంటే.. సొంతదారిలో వెళ్లాలని కవిత నిర్ణయం

తన దారి కేసీఆర్ దారేనని తేల్చిచెప్పిన హరీష్

హరీష్ ఇంట్లో కేటీఆర్ భేటీపై గులాబీవర్గాల ఆసక్తి

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాజకీయాల్లో, బీఆర్ఎస్ లో శుక్రవారం కీలక పరిణామం చోటు చేసుకుంది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. మాజీ మంత్రి హరీశ్ రావు ఇంటికి వెళ్లారు. ఆయనతో రెండు గంటల పాటు ఏకాంతంగా చర్చలు జరిగారు. ముఖ్యమంత్రి కేసీఆర్ తనయ, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అమెరికా వెళ్ళిన సమయంలో కేటీఆర్ హరీష్ రావు ఇంటికి వెళ్ళి ఎన్నడూ లేని రీతిలో రెండుగంటలకు పైగా చర్చలు జరపడం ఆసక్తిగా మారింది. ఇటీవలే హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ కేటీఆర్ కు పార్టీ పగ్గాలు

మిగతా 2లో

ఫ్యూచర్ సిటీలో
# స్మార్ట్ పోల్స్

## అండర్ గ్రౌండ్ పవర్ కేబుల్స్

విద్యుత్ టవర్లు, పోల్స్ బయటికి కనపడొద్దు

గతేడాదితో పోలిస్తే 9.8 శాతం పెరిగిన వినియోగం

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి వల్లే

హైదరాబాద్‌లో డేటా సిటీ ఏర్పాటు చేయబోతున్నాం

భవిష్యత్తులో హైదరాబాద్ డేటా సెంటర్ల హబ్‌గా మారుస్తాం

నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం.. రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు

నకిలీ దందా వ్యాపారులపై పీడీ యాక్ట్ కేసులు పెట్టాలి

అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

విద్యుత్, వ్యవసాయ శాఖలపై మంత్రులతో సీఎం సమీక్షలు



**మహా:** హైదరాబాద్‌లో డేటా సిటీ ఏర్పాటు చేయబోతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. భవిష్యత్తులో హైదరాబాద్ డేటా సెంటర్ల హబ్‌గా మారబోతుందని ధీమా వ్యక్తం చేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో స్మార్ట్ పోల్స్‌ను ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సెక్రటేరియట్, నెక్లస్ రోడ్, కేబీఆర్ పార్కు వంటి ప్రాంతాల్లో స్మార్ట్ పోల్స్‌ను తీసుకురావాలన్నారు. 160 కిలోమీటర్ల అవుటర్ రింగ్ రోడ్‌లో సోలార్ విద్యుత్ ఉత్పత్తి కోసం కావాల్సిన ప్రణాళికలను సిద్ధం చేయాలని జీహెచ్ఎంసీ పరిధిలోని పుట్ పాత్‌లు, నాలా ల్లో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు. విద్యుత్ శాఖపై సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు.

మిగతా 2లో

## కమీషన్లపై దర్యాప్తు చేయాలె

**వారు తీసుకున్న కమీషన్లు బయటపెట్టాలి**



- ఆ లెక్కలనీ సీఎం ప్రజల ముందు పెట్టాలి
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు
- నేడు ట్యాంక్ బండ్ వద్ద తిరంగా యాత్ర
- ఈ ర్యాలీ నా ప్రోగ్రామ్ కాదు.. ఇది ప్రజల కార్యక్రమం
- పార్టీలకతీతంగా అందరూ యాత్రలో పాల్గొనాలి
- రాజకీయాలకు అతీతంగా సైన్యానికి అండగా ఉందామని పిలుపు

వివరాలు 2లో

# తడిసిన ధాన్యాన్ని కొంటాం

## రైతులేవరూ అధైర్యపడొద్దు

ధాన్యం సేకరణ ఓ మహా యజ్ఞం.. అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కొనుగోళ్ల ప్రక్రియ కలెక్టర్లు పర్యవేక్షించాలి.. యాసంగిలోనూ రికార్డు స్థాయిలో దిగుబడి

ఇప్పటి వరకు 49.53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ: మంత్రి ఉత్తమ్

ధాన్యం కొనుగోళ్ల పురోగతిపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



**హైదరాబాద్, మహా:**

రాష్ట్రంలో తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తామని, రైతులు అధైర్య పడొద్దని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఈసారి రాష్ట్రంలో యాసంగి సీజన్‌లో రికార్డు స్థాయిలో వరి ధాన్యం సాగు అయిందనిఅన్నారు. ఈ నేపథ్యంలో ధాన్యం సేకరణను ఓ మహా యజ్ఞంలా భావిస్తూ, రైతుల నుండి ప్రభుత్వం పెద్ద ఎత్తున మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తోందని తెలిపారు. శుక్రవారం మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌లతో కలిసి యాసంగి ధాన్యం సేకరణపై మంత్రులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ..

మిగతా 3లో

## కల్లు తాగిన కోతిలా సైకో రామ్ మాటలు

- కలెక్టర్లతో కాళ్లు కడిగించుకున్న దౌర్భాగ్య పరిస్థితి మీది
- కోడి గుడ్డు పైన ఈకలు పీకినట్లు ప్రతీది రాజకీయం చేస్తున్నారు
- రాష్ట్రాన్ని గాడిలో పెడుతుంటే కేటీఆర్ డిస్టర్బ్ చేస్తుండు
- బీఆర్ఎస్ నేతకు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్

02

## కాంగ్రెస్ కమీషన్ సర్కార్

- మంత్రి సురేఖ వ్యాఖ్యలపై దర్యాప్తు చేయించగలరా?
- కమీషన్లు తీసుకుంటున్న మంత్రుల పేర్లు బయట పెట్టాలి
- నిజాలు బయట పెట్టినందుకు మంత్రికి అభినందనలు
- ఎక్స్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్వీట్

03





# హరీశ్ ఇంటికి వెళ్లిన కేటీఆర్

## రెండు గంటల పాటు కీలక చర్చలు

### కవిత వ్యవహారశైలిపైనే ప్రధాన చర్చ

పార్టీలో తన బాధ్యత ఏంటో తేల్చమని వార్నింగ్ ఇచ్చిన కవిత

వరుసగా తనను అవమానిస్తున్నారన్న ఆవేదనలో కవిత

ప్రాధాన్యం లేకుంటే.. సొంతదారిలో వెళ్లాలని కవిత నిర్ణయం

తన దారి కేసీఆర్ దారేనని తేల్చిచెప్పిన హరీష్

హరీష్ ఇంట్లో కేటీఆర్ భేటీపై గులాబీవర్గాల ఆసక్తి

(మొదటిపేజీ తరువాయి)
ఇస్తే స్వాగతిస్తానని, తన దారి కేసీఆర్ దారేనని తేల్చిచెప్పారు. కేసీఆర్ ఏ బాధ్యత అప్పగించినా చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానంటూ క్లారిటీ ఇచ్చారు. ఈ వ్యాఖ్యలు చేసిన 48 గంటల తర్వాత స్వయంగా కేటీఆర్ హరీశ్ ఇంటికి వెళ్లడం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. మాజీ సీఎం కేసీఆర్ తనయ, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సరిగ్గా అమెరికా పర్యటనకు బయలుదేరుతున్న సమయంలో గులాబీ పార్టీలోని కీలక నేతలు భేటీ కావడం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

**తాడోపేడో**

గత కొద్దిరోజులుగా పార్టీలో, సోషల్ మీడియాలో తనకు జరుగుతున్న అవమానాలపై ఎమ్మెల్సీ కవిత తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఆమె ఇటీవలే చేసిన వ్యాఖ్యలు ఈ సందర్భంగా చర్చకు వస్తున్నాయి. హరీశ్ రావు ప్రెస్ మీట్ కు ఒక రోజు ముందే అంటే ఈ నెల 12న కవిత మాట్లాడుతూ.. ఆరునెలలు జైల్లో ఉన్నది చాలదా..? ఇంకా ఎన్ని రోజులు కష్టపెడతారంటూ కామెంట్ చేశారు. కొందరు తనపై పనిగట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నారని, సమయం వచ్చినప్పుడు అన్నీ బయటపడ్తాయంటూ కామెంట్ చేశారు. కవితను కష్టపెడుతున్నది ఎవరు అన్న చర్చ జరుగుతున్న తరుణంలోనే మరుసటి రోజు హరీశ్ రావు ప్రెస్ మీట్ పెట్టి కేటీఆర్ కు బాధ్యతలు అప్పగిస్తే స్వాగతిస్తానని చెప్పడం గమనార్హం. ఇది జరిగిన రెండు రోజుల వ్యవధిలోనే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా హరీశ్ రావు ఇంటికి వెళ్లడం, రెండు గంటల పాటు భేటీ కావడం హాట్ టాపిక్ గా మారింది. తనకు పార్టీలో ఏ బాధ్యత అప్పగిస్తారో తేల్చాలని కవిత డిమాండ్ చేస్తున్నారు. తాను డాటర్ ఆఫ్ ఫైటర్ అని, తనలో పోరాట స్ఫూర్తి మిగిలే ఉందని.. ఆరు నెలలు జైల్లో ఉన్నానని, తనను నమ్ముకున్న వారి కోసం ఎలాంటి పోరాటానికైనా రెడీ అంటున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ లేదా మహిళా విభాగ పగ్గాలను కవితకు అప్పగించాలన్న డిమాండ్ ఆమె అనుచరులవైపు నుండి వినబడుతోంది. ఈ క్రమంలో మళ్ళీమళ్ళీ అవమానాలు ఎదురైతే కవిత ఊరుకునే పరిస్థితిలో లేదని కేటీఆర్ కు అర్థమయ్యేలా సమాచారం పంపినట్లు తెలిసింది. పరిస్థితుల్లో మార్పు లేకుంటే కవిత తన ప్రయాణం తాను చూసుకునే అవకాశాలు ఉండవచ్చని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. కవిత ఇప్పటికే తన రాజకీయ వ్యూహం, భవిష్యత్తు రచించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. కవిత కట్టడి, పార్టీ కమిటీలు, భవిష్యత్ వ్యూహంపై తాజా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. తెలంగాణ రాజకీయవర్గాల్లో ఈ భేటీ ఆసక్తికర చర్చలకు దారితీసింది. హరీష్ రావు పార్టీ పెట్టబోతున్నారని, ఆయనను ఆపేందుకు కేటీఆర్ హరీష్ ఇంటికి వెళ్ళారంటూ ప్రభుత్వవిప్ రామచంద్రునాయక్ ఆరోపణలు చేశారు.

**చిచ్చుపెట్టిన వరంగల్ సభ**

బీఆర్ఎస్ పార్టీలో కొంతకాలంగా ఆధిపత్యపోరు కొనసాగుతోంది. ఎల్కతుర్తిలో జరిగిన రజతోత్సవ సభల పర్యవేక్షణ బాధ్యతలను తొలుత హరీశ్ కు కేసీఆర్ అప్పగించారు . తర్వాత ఆయనను తప్పించారు. ఈ క్రమంలో ఆయన పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. దీంతో హరీశ్ రావు పార్టీ మారుతారనే ప్రచారం ఊపందుకుంది. తాను ఏ పార్టీలోకి వెళ్లడం లేదని మీడియా ముఖంగా క్లారిటీ ఇచ్చారు. తనపై దుష్ప్రచారం చేస్తున్న వారిపై లీగల్ చర్యలకు దిగుతానని కూడా హెచ్చరించారు. అదే సందర్భంగా కేటీఆర్ కు బాధ్యతలు అప్పగిస్తే స్వాగతిస్తానని అన్నారు. కేసీఆర్ మాటే శిరోధార్యం అని, ఆయనతో చివరివరకు ఉంటానని తెగేసి చెప్పారు. ఆయన లైన్ లోనే కొనసాగుతానని పార్టీ మార్పు వార్తలను ఖండించారు. ఎమ్మెల్సీ కవిత ను పూర్తిగా పక్కనపెట్టారన్న ప్రచారం నేపథ్యంలో సభ గడువు దగ్గరపడ్డాక కవితతో మీటింగ్ పెట్టి.. మహిళల సమీకరణ బాధ్యత అప్పగించారు. అయితే స్టేజీ వద్ద ఎక్కడా కేటీఆర్ మినహా హరీష్, కవిత కటౌట్లు, ప్రచార చిత్రాలు పెట్టలేదు. పూర్తిగా కేసీఆర్, కేటీఆర్ బొమ్మలతోనే సభ జరిగింది. సభ కోసం కష్టపడ్డ కవిత ఆ తర్వాత మరిన్ని అవమానాలకు గురయ్యారు.

# ఫ్యూచర్ సిటీలో స్మార్ట్ పోల్స్

(మొదటిపేజీ తరువాయి)
ఈ సందర్భంగా అధికారులకు సీఎం పలు సూచనలు చేశారు. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు ఇతర కార్పొరేషన్లలో విద్యుత్ అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ఫ్యూచర్ సిటీలో పూర్తి భూగర్భ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయాలని ఫ్యూచర్ సిటీలో విద్యుత్ టవర్లు, పోల్స్, లైన్స్ బహిరంగంగా కనిపించడానికి వీలులేదన్నారు. హై టెన్షన్ లైన్లను కూడా అక్కడి నుంచి తరలించాల్సి ఉంటుందని సూచించారు. ప్రభుత్వం తీసుకువచ్చే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల వల్ల రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరగబోతోందని అందుకు అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని అధికారులను రేవంత్ రెడ్డి కోరారు. రాష్ట్రంలో నిర్మించే నీటిపారుదల ప్రాజెక్టుల విద్యుత్ అవసరాలు, రైల్వే లైన్లు, మెట్రో, ఇతర మాస్ ట్రాన్స్ పోర్ట్ ల విద్యుత్ అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు.

**ఎలాంటి అంతరాయం లేకుండా..**

భవిష్యత్‌లో హైదరాబాద్‌లో డేటా సిటీ ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. కొత్తగా ఏర్పాటు చేయబోయే డేటా సెంటర్లు, పారిశ్రామిక వాడలకు కావాల్సిన విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. రీజనల్ రింగ్ రోడ్డు పరిధిలో నిర్మించే రేడియల్ రోడ్లు, శాటిలైట్ టౌన్ షిప్ లకు కావాల్సిన విద్యుత్ అవసరాలపైన హెచ్ఎండీఏతో సమన్వయం చేసుకోవాలన్నారు. క్షేత్ర స్థాయిలో విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సబ్ స్టేషన్లను అప్ గ్రేడ్ చేసుకోవడం, విద్యుత్ లైన్ల ఆధునీకరణపై దృష్టిసారించాలన్నారు. గత ఏడాదితో పోల్చితే విద్యుత్ డిమాండ్ 9.8 శాతం పెరిగిందని ఈ ఏడాది అత్యధికంగా 17,162 మెగావాట్లకు విద్యుత్ డిమాండ్ చేరుకుందని ముఖ్యమంత్రికి అధికారులు వెల్లడించారు. 202526లో 18,138 మెగావాట్లకు డిమాండ్ పెరుగుతుందని అది 2034 35 నాటికి 31,808 మెగావాట్ల డిమాండ్ కు చేరుకునే అవకాశం



ఉందని తెలిపారు. ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ ను అందిస్తున్నట్లు ముఖ్యమంత్రికి వివరించారు. అలాగే జీరో కరెంట్ బిల్లులను అర్హులైన వారికి ప్రతి నెల అందజేయాలని అంటూ, వారికి కూడా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు రేవంత్.

**ఎవరినీ ఉపేక్షించకుండా..**

అనంతరం సచివాలయంలో వ్యవసాయ శాఖ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు వానాకాలం పంటల సాగుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్ రావు, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపితో పాటు ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. వానాకాలం పంటల సాగుకు సన్నద్ధంగా ఉండాలని వ్యవసాయ శాఖ అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అన్ని జిల్లాల్లో సాగు విస్తీర్ణానికి సరిపడేన్ని విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. నకిలీ విత్తనాలు, రైతులను మోసం చేసే కంపెనీలు, వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి హెచ్చరించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించే వ్యాపారులపై ఉక్కుపాదం మోపాలని సీఎం అధికారులను ఆదేశించారు. కల్తీ, నకిలీ విత్తనాల దందాను అరికట్టేందుకు అన్ని జిల్లాల్లో కలెక్టర్లు, పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాల వారీగా వ్యవసాయ శాఖ, పోలీస్ విభాగం సంయుక్తంగా టాస్క్ ఫోర్స్ దాడులు నిర్వహించాలని, రాష్ట్ర సరిహద్దులు అన్ని చోట్ల టాస్క్‌ఫోర్స్ నిఘా ఉంచాలని చెప్పారు. రైతులను మోసం చేసే వారిపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను సీఎం హెచ్చరించారు. ఎవరెవరు కల్తీ విత్తనాలు విక్రయిస్తున్నారు? ఎక్కడ నిల్వలులున్నాయి? ఎక్కడ నుంచి రవాణా అవుతున్నాయనే వివరాలన్నీ అధికారులకు సమాచారం ఉన్నదని, ఎవరినీ ఉపేక్షించకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని నొక్కి చెప్పారు. నకిలీ దందా చేసే వ్యాపారులపై పీడీ యాక్ట్ కేసులు పెట్టాలని ఆదేశించారు.



# రేపో మాపో చెల్లి రాజీనామా

### అందుకే పిచ్చోడిలా కేటీఆర్ మాటలు
### మంత్రి సీతక్క సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, మహా:** కేటీఆర్ కు అధికారం పోయాక పిచ్చోడు అయిపోయాడని, చెల్లి రేపో మాపో రాజీనామా చేస్తదని ఫ్రస్టేషన్ లో ఇష్టమొచ్చినట్లు చేస్తున్నాడని మంత్రి సీతక్క సంచలన వ్యాఖ్యలు చేశారు. కమిషన్లకి కక్కుర్తి పడ్డది కేటీఆర్.. బీఆర్ఎస్ పార్టీది కమిషన్ల ప్రభుత్వం, కన్నీళ్లు తుడిచే ప్రభుత్వం తమది అని ఆమె అన్నారు. సుందరీమణుల్లో ఒకరికి ఒక్క అమ్మాయి అలా చేస్తే దాన్ని ప్రభుత్వానికి అంట గట్టడం అవివేకం, దుర్మార్గం అని ఆగ్రహం వ్యక్తం చేసింది. కేటీఆర్ అబద్ధాలు చెప్పి కాలం వెల్లదిస్తున్నారని..గత ప్రభుత్వం తప్పుడు నిర్ణయాలతో భూములు మారిపోయాయని మంత్రి సీతక్క విమర్శించింది.

# కమీషన్లపై దర్యాప్తు చేయాలె

## వారు తీసుకున్న కమీషన్లు బయటపెట్టాలి

ఆ లెక్కలనీ సీఎం ప్రజల ముందు పెట్టాలి.. బీజేపీ స్టేట్ చీఫ్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

నేడు ట్యాంక్ బండ్ వద్ద తిరంగా యాత్ర.. ఈ ర్యాలీ నా ప్రోగ్రామ్ కాదు.. ఇది ప్రజల కార్యక్రమం

పార్టీలకతీతంగా అందరూ యాత్రలో పాల్గొనాలి

రాజకీయాలకు అతీతంగా సైన్యానికి అండగా ఉందామని పిలుపు

**హైదరాబాద్, మహా:** మంత్రి కొండా సురేఖ మంత్రులు కమీషన్లు తీసుకోవడం కామన్ అనడం బాధాకరమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. అంటే రాష్ట్రంలో మంత్రులు కమీషన్లు తీసుకుంటున్నారని ఒప్పుకున్నట్లు కనిపిస్తోందని ఆయన కామెంట్స్ చేశారు. శుక్రవారం బీజేపీ స్టేట్ ఆఫీస్‌లో మీడియాతో మాట్లాడారు. ఏయే శాఖ మంత్రి ఎంత తీసుకున్నారో దర్యాప్తునకు ఆదేశించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. మంత్రులు తీసుకున్న కమీషన్లు బయట పెట్టాలంటూ వ్యాఖ్యలు చేశారు. త్రివిధ దళాలకు మద్దతుగా నేడు హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ వద్ద తిరంగా యాత్ర నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పార్టీలకతీతంగా అందరూ తరలివచ్చి ఈ యాత్రను విజయవంతం చేయాలని కోరారు. పెహల్గామ్ ఉగ్రదాడికి వ్యతిరేకంగా భారత త్రివిధ దళాలు వీరోచితంగా పోరాడాయని గుర్తు చేశారు. పిల్లల ముందు తండ్రిని, భార్యల ముందు భర్తలను, అత్యంత క్రూరంగా హత్య చేసిన ఘటన ప్రపంచంలో ఇదే తొలిసారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ ఘటనను అంతర్జాతీయ సమాజం తీవ్రంగా ఖండించిందని పేర్కొన్నారు. మానవ సమాజానికి సవాలుగా నిలిచిన టెర్రరిస్టులను కఠినంగా శిక్షించాలనే ఉద్దేశ్యంతోనే భారత్ ఆపరేషన్ సింధూర్ నిర్వహించిందని గుర్తు చేశారు. భారత సైన్యం ఉగ్రవాదుల ఇళ్ళు, శిబిరాలు, స్థావరాలను మాత్రమే టార్గెట్ చేసిందని గుర్తు చేశారు. జన సాంద్రత ఉన్న ప్రాంతాల్లో ప్రాణ నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకుని, భారత సైన్యం, ఎయిర్ ఫోర్స్ సిబ్బంది ఉగ్రవాద స్థావరాలను టార్గెట్ చేసిందని చెప్పారు. ఆపరేషన్ సిందూర్‌లో భారత విమానాన్ని హైజాక్ చేసిన ఉగ్రవాదులు కూడా హతమయ్యారని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. గతంలో హైదరాబాద్ నగరంలోనూ అనేక ఉగ్ర ఘటనలు జరిగాయని గుర్తు చేశారు.

**అబద్ధాలతో తప్పుడు ప్రచారం..**

'భారత్‌పై దాడులు చేస్తే ప్రతిదాడి కఠినంగా ఉంటుందని ఆపరేషన్ సిందూర్‌తో చెప్పాం. సుమారు 100 ఉగ్రవాదులను మట్టుబెట్టడంతో పాటు, వారికి సహకరించే పాక్ సైనికులు కూడా చనిపోయారు. పాకిస్థాన్‌లోని భారత ఎంబసీని మూసివేసి, పాకిస్థాన్ వీసా కలిగిన వారిని దేశం విడిచి వెళ్లిపోవాలని ఆదేశించాం. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఖాందహార్ విమాన హైజాక్, పుల్వామా ఉగ్రదాడిలో కీలక పాత్ర వహించిన ఉగ్రవాదులు యూసుఫ్ అజార్, అబ్దుల్ మాలిక్ రవూఫ్, ముదాసిర్ అహ్మద్ లాంటి వారిని అంతమొందించాం. పాకిస్థాన్ ప్రస్తుతం దిక్కుతోచని పరిస్థితుల్లో భారతదేశంలోని ఎయిర్ బేసులపై దాడి చేసి విమానాలను కూల్చివేశామని అబద్ధాలతో తప్పుడు ప్రచారం చేస్తోంది' అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.



# కల్లు తాగిన కోతిలా సైకో రామ్ మాటలు

- కలెక్టర్లతో కాళ్లు కడిగించుకున్న దౌర్భాగ్య పరిస్థితి మీది
- కోడి గుడ్డు పైన ఈకలు పీకినట్లు ప్రతీది రాజకీయం చేస్తున్నారు
- రాష్ట్రాన్ని గాడిలో పెడుతుంటే కేటీఆర్ డిస్టర్బ్ చేస్తుండు
- బీఆర్ఎస్ నేతకు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్

**మహా:** మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మహిళల ఆత్మగౌరవం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు ఆయన కౌంటర్ ఇచ్చారు. ఈ మేరకు ఆయన శుక్రవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ అప్పుల పాలు చేసిన రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలని సీఎం రేవంత్ రెడ్డి చూస్తుంటే.. కేటీఆర్ డిస్టర్బ్ చేస్తుండు అంటూ మండిపడ్డారు. కోడి గుడ్డు పైన ఈకలు పీకినట్లు బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని, సైకో రాము (కేటీఆర్) కల్లు తాగిన కోతి లాగా మాట్లాడుతుండని విమర్శించారు. రామప్ప గుడి దగ్గర అత్యుచ్ఛాహంతో ఎవరో ఒక అమ్మాయి మిస్ వరల్డ్ కంటెస్టెంట్ కాళ్ళు కడిగింది.. దానికి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి అన్నట్లు గొడవ చేస్తున్నారని చెప్పారు. దానికి తెలంగాణ మహిళల ఆత్మ గౌరవం ఏమైందంటూ కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీకి ట్వీట్ చేశారని మండిపడ్డారు. పదేళ్లు వాళ్ల ఇంటి ఆడబిడ్డ గురించి తప్ప ఏ ఇంటి ఆడబిడ్డ గురించి మాట్లాడలేదని రెడ్డి విమర్శించారు. కలెక్టర్లతో కాళ్లు కడిగించుకున్న దౌర్భాగ్య పరిస్థితి మీదని.. జనాన్ని తప్పుదోవ పట్టించాలని కేటీఆర్ రోజు ఎదో ఒకటి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో దండుకున్న వందల కోట్ల రూపాయలతో కొన్ని యూట్యూబ్ చానల్స్‌తో.. మార్ఫింగ్ వీడియోలతో కేటీఆర్ తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని విమర్శించారు.

# నేనట్ల అనలే

## నా వ్యాఖ్యలను పూర్తిగా వక్రీకరించారు

ఈ ప్రభుత్వం కాదు.. బీఆర్ఎస్ ప్రభుత్వంలోని మంత్రులపై మాట్లాడాను

చిన్న క్లిప్ కట్ చేసి బీఆర్ఎస్ పెయిడ్ బ్యాచ్ ప్రచారం చేస్తోంది

మంత్రులు డబ్బు వసూలు వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ క్లారిటీ

**మహా:** తన వ్యాఖ్యలను బీఆర్ఎస్ వక్రీకరించి సోషల్ మీడియాలో ప్రచారం చేస్తోందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ గులాబీ పార్టీ నేతలపై మండిపడ్డారు. ఫార్మా కంపెనీ వాళ్లు ప్రలోభాలకు గురి చేయాలని చూస్తే గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరి కాంగ్రెస్ ప్రభుత్వం ఉండబోదని చెప్పానని తెలిపారు. దానిని ఎడిటింగ్ చేసి, దుష్ప్రచారం చేస్తున్నారన్న ఆమె, ప్రభుత్వ పథకాలు పేదలకు అందాలని మాత్రమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. హన్మకొండలోని తన నివాసంలో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు మాట్లాడారు. పారదర్శకంగా ప్రభుత్వం నడుపుతుంటే కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. సెక్రటేరియట్‌లో తాము ఏం మాట్లాడలేని పరిస్థితి ఉందని, ఈ పరిస్థితులు తయారు చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని విమర్శించారు. మంత్రులు తప్పు చేశారని ట్రోలింగ్ చేస్తున్న వాళ్లు వెంటనే ఆపకపోతే సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. ఈ క్రమంలోనే 2014కు ముందు కవిత, కేటీఆర్‌ల ఆస్తులు ఎంత, ప్రస్తుతం ఎంత ఉన్నాయో బహిరంగ చర్చలకు సిద్ధమా అని వారికి సవాల్ విసిరారు. అవినీతికి పాల్పడకుండా ఇంత ఆస్తి ఎలా వచ్చిందని ప్రశ్నించారు. మీరు అవినీతికి పాల్పడి, తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దీనిని సహించబోమని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు.



**అసలు మంత్రి కామెంట్స్ ఏంటంటే?**

వరంగల్‌లోని కృష్ణా కాలనీలో బాలికల జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి ఇటీవల భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి, కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద రూ.4.5 కోట్లతో భవనం నిర్మించేందుకు అరబిందో ఫార్మా కంపెనీ ముందుకు వచ్చిందని తెలిపారు. ఈ క్రమంలోనే 'అనుమతుల కోసం కొన్ని దస్త్రాలు మంత్రుల వద్దకు వస్తుంటాయి. అలాంటి ఫైళ్లు వచ్చినప్పుడు సాధారణంగా మంత్రులు డబ్బులు తీసుకుని క్లియరెన్స్ ఇస్తుంటారు. మేము మాత్రం మాకు రూపాయి అవసరం లేదు. స్కూల్‌ను అభివృద్ధి చేస్తే చాలు' అని కోరాం అని ఆమె వ్యాఖ్యానించారు. ఇది కాస్త వివాదాస్పదం కావడంతో తాజాగా మంత్రి కొండా సురేఖ క్లారిటీ ఇచ్చారు.

# హరీష్ రావు కొత్త రాజకీయ పార్టీ ప్రచారం

### అందుకే కేటీఆర్ హుటాహుటిన ఆయన ఇంటికి
### ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్ వ్యాఖ్యలు

**మహా :** కల్వకుంట్ల కుటుంబంలో విభేదాలు తారాస్థాయికి చేరాయని కాంగ్రెస్ ఎమ్మెల్యే రామచంద్రనాయక్ సంచలన ఆరోపణలు చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌లో ముసలం మొదలైందని అన్నారు. పార్టీ ప్లీనరీ నుంచి హరీష్ రావుకు ప్రాధాన్యత ఇవ్వడం లేదని తెలిపారు. వీలైనంత తొందరగా ఆ పార్టీ హరీష్ రావు బయటకు వస్తారని.. ఆ వెంటనే కొత్త పార్టీ పెట్టబోతున్నాడని ప్రచారం జరుగుతోందని హాట్ కామెంట్స్ చేశారు. అందుకే హుటాహుటిన హరీష్ రావు ఇంటికి కేటీఆర్ వెళ్లాడని చెప్పారు. ఎన్నడూ లేనిది హరీష్ రావు ఇంటికి కేటీఆర్ వెళ్లాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. ఇప్పటికిప్పుడు హరీష్ రావు మీద అంత ప్రేమ ఎలా పుట్టుకొచ్చిందని అడిగారు. హరీష్ రావు బయటకు రావాలని గట్టిగా ఫిక్స్ అయ్యారని.. ఈ విషయం



కేటీఆర్ చెవిలో పడటంతో ఉన్నపళంగా హరీష్ రావు ఇంటికి వెళ్లి బతిమిలాడినట్లు సమాచారం అందుతోందని రామచంద్ర నాయక్ అన్నారు.

# హాస్పిటల్‌లో అందగత్తెలు

## ఏఐజీ హాస్పిటల్, పిల్లలమర్రి, ఎక్స్‌పీరియం ఎకో పార్క్ సందర్శన


చికిత్స పొందుతున్న చిన్నారులు, వృద్ధులతో ఆత్మీయంగా పలకరింపులు

అనంతరం పిల్లలమర్రి, ఎక్స్‌పీరియం ఎకో పార్క్ విజిట్.. సేంద్రీయ వ్యవసాయ పద్ధతులపై అవగాహన

గద్వాల పట్టు చీరలు, వాటి ప్రత్యేక నేత పద్ధతులు వీక్షించిన ముద్దుగుమ్మలు







**మహా:** ప్రపంచ సుందరీమణులు ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా వారు వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. తమ పర్యటనలో భాగంగా, మిస్ వరల్డ్ 2025 పోటీదారులు శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రముఖ ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ (ఏఐజీ) ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో వారు ముచ్చటించారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడిన అనంతరం, వారి ఆరోగ్య పరిస్థితి, వారికి అందుతున్న వైద్య సేవల గురించి అక్కడి వైద్యులను అడిగి వివరాలు సేకరించారు. మిస్ వరల్డ్ పోటీదారుల సందర్శన ఆసుపత్రిలోని రోగులకు, సిబ్బందికి కొంత ఉత్సాహాన్ని, మానసిక సాంత్వనను కలిగించింది. వారి పర్యటన సామాజిక సేవా దృక్పథాన్ని ప్రతిబింబించేలా సాగింది.

**పిల్లలమర్రి, ఎక్స్‌పీరియం ఎకో పార్క్ విజిట్..**

అలాగే మిస్ వరల్డ్ పోటీ దారులు మహబూబ్ నగర్ జిల్లాకు చేరకున్నారు. అక్కడ పిల్లల మర్రిని సందర్శించారు. ఏడు వందల ఏళ్ల చరిత్ర కలిగిన పిల్లలమర్రి చెట్టు గురించి వారికి అధికారులు వివరించారు. మహబూబ్ నగర్ జిల్లాకు చేరుకున్న అందాలభామలకు బతుకమ్మ ఆటలతో స్వాగతం పలికారు. ఇరవై దేశాలకు చెందిని సుందరీమణులు సందర్శించారు. చెట్టుచరిత్రను గురించి అడిగి మరీ తెలుసుకుని అక్కడ ఫొటోలకు పోజులిచ్చారు. అక్కడ ఉన్న పురావస్తు కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి విశిష్టతలను గురించి అధికారులు సుందరీమణులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి, జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి.. జిల్లా ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, జీఎంఆర్, వీర్లపల్లి శంకర్, చిట్టెం పరిణికా రెడ్డి పాల్గొన్నారు. 16వ శతాబ్దం నాటి రాజరాజేశ్వర సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయ విశిష్టతను మిస్ వరల్డ్ పోటీదారులకు చరిత్రకారుడు శివ నాగిరెడ్డి వివరించారు. ఆలయ ప్రాంగణంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలో సేకరించిన పలు విగ్రహాల విశిష్టతను గురించి తెలిపారు. హైదరాబాద్ శివార్లలో ఉన్నగండిపేట లో ఉన్న ఎకో పార్కుకు అందాల భామలు చేరుకున్నారు. వారికి తెలంగాణ బరాత్ స్టయిల్లో స్వాగతం పలికారు. అక్కడ మొక్కలు నాటేందుకు సుందరీమణులు సిద్ధమయ్యారు. అందాల భామల పర్యటనకు భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఆ తరువాత పార్క్‌లోని సన్‌డౌనర్ పాయింట్, బుద్ధ ఇన్‌సైడ్ ట్రీ స్పాట్, రెడ్ టెయిల్ ఫార్మేషన్ స్పాట్, ఓవల్ ట్రీ స్పాట్, ఈజిప్షియన్ రాక్ స్పాట్ వంటి ప్రదేశాలను సుందరీమణులు సందర్శించారు. పార్క్ దార్శనికత, అమలు పట్ల తమ విస్మయం, ప్రశంసలను వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ కమీషన్ సర్కార్

## మంత్రి సురేఖ వ్యాఖ్యలపై దర్యాప్తు చేయించగలరా?

కమీషన్లు తీసుకుంటున్న మంత్రుల పేర్లు బయట పెట్టాలి

నిజాలు బయట పెట్టినందుకు మంత్రికి అభినందనలు

ఎక్స్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్వీట్



**మహా:** మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో కనీసం ఇప్పటికైనా కొన్ని నిజాలు బయటపెట్టినందుకు కొండా సురేఖకు హృదయపూర్వక అభినందనలు తెలుపుతున్నానంటూ ఆయన ఎక్స్ వేదికగా వ్యంగ్యాస్త్రాలు సంధించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 'కమీషన్ సర్కార్'గా మారిపోయిందని ఆరోపించారు. మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ కేటీఆర్ తన ట్వీట్‌లో పలు కీలక ఆరోపణలు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక 'కమీషన్ సర్కార్'గా నడుస్తోందన్నది ఇప్పుడు బహిరంగ రహస్యమే. ఈ ప్రభుత్వంలో ఫైళ్లపై సంతకాలు పెట్టాలంటే మంత్రులు, వారి సహచర మంత్రులు ఏకంగా 30 శాతం కమీషన్ తీసుకుంటున్నారు అని కేటీఆర్ ఆరోపించారు. ఇది అత్యంత దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు. గతంలో సచివాలయంలో కొందరు కాంట్రాక్టర్లు ఇదే కమీషన్ల వ్యవహారంపై ధర్నా చేసిన ఘటనను కేటీఆర్ గుర్తు చేశారు. ఆ సంఘటనే ఈ ప్రభుత్వంలో మంత్రుల కమీషన్ల భాగోతాన్ని బహిర్గతం చేసిందని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖకు కేటీఆర్ ఒక విజ్ఞప్తి చేశారు. 'కమీషన్లు తీసుకుంటున్న ఆ మంత్రుల వివరాలను, వారి పేర్లను ప్రజల ముందు బహిర్గతం చేయాలి' అని ఆయన డిమాండ్ చేశారు. నిజాలు మాట్లాడినందుకు అభినందిస్తున్నానని, అయితే, ఆరోపణలకు మరింత బలం చేకూర్చేలా వివరాలు వెల్లడించాలని కోరారు. ఇదే అంశంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించాలని డిమాండ్ చేశారు. "మీ సొంత కేబినెట్ మంత్రి చేసిన ఈ తీవ్ర ఆరోపణలపై మీరు దర్యాప్తుకు ఆదేశించగలరా' అని వారిని ప్రశ్నిస్తూ కేటీఆర్ తన ట్వీట్‌ను ముగించారు.



# హజ్ యాత్ర ప్రతి ముస్లిం కల

## ఈ యాత్ర వారి జీవితంలో ఆధ్యాత్మిక శాంతి తేవాలి

హజ్ యాత్రికుల బస్సుల ఫ్లాగ్ ఆఫ్ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి



**మహా:** హజ్ పవిత్ర యాత్ర వారి జీవితంలో ఆధ్యాత్మిక శాంతిని, సంతోషాన్ని తీసుకురావాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం హజ్ యాత్రకు బయలుదేరే బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. హైదరాబాద్‌లోని నాంపల్లి హజ్ హౌస్‌లో హజ్ యాత్రికుల బస్సుల ఫ్లాగ్ ఆఫ్ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, యాత్రకు జెండా ఊపారు. ఈ కార్యక్రమంలో ఆయన హజ్ యాత్రికులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఈ రాష్ట్ర ప్రభుత్వం యాత్రికులకు అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. హజ్ కమిటీ ఆఫ్ ఇండియా సమన్వయంతో రవాణా, వసతి, వైద్య సహాయం వంటి ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. 2025 హజ్ యాత్ర కోసం తెలంగాణ నుంచి సుమారు 4,200 మంది యాత్రికులు ఎంబార్కేషన్ పాయింట్ హైదరాబాద్ ద్వారా సౌదీ అరేబియాకు బయలుదేరుతున్నారు. ఈ యాత్రికులు హైదరాబాద్ నుంచి జెడ్డా, మదీనా విమానాల ద్వారా యాత్రను కొనసాగిస్తారు.

# తడిసిన ధాన్యాన్ని కొంటాం



(మొదటిపేజీ తరువాయి)

రైతు సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని వెల్లడించారు. యాసంగిలోనూ రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడి వచ్చిందన్నారు. 60.14 లక్షల ఎకరాల్లో వరి ధాన్యం సాగు కాగా 129.35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా వేశామన్నారు. 70.13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటికే 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు చేసినట్లు తెలిపారు. 2023 రబీ సీజన్ లో మే15 నాటికి 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే, ఈ రబీ సీజన్ లో అదే మే 15 నాటికి 50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు చేశామన్నారు.

**యాసంగిలోనూ రికార్డు స్థాయిలో..**

ముందెన్నడూ లేని విధంగా యాసంగిలో 8,348 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ధాన్యం కొనుగోళ్లను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. రైతుల అభీష్టానికి అనుగుణంగా ధాన్యం కొనుగోళ్లు చేస్తామని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సన్నాలకు బోనస్ సైతం చెల్లించడం జరుగుతుందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెస్తున్నందున కొనుగోళ్ల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ముఖ్యంగా లారీలు, హమాలీల కొరత తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని అన్నారు. ధాన్యం నిల్వ చేసుకునేందుకు వీలుగా ఇంటర్మీడియట్ గిడ్డంగులను గుర్తించాలని సూచించారు. అకాల వర్షాల వల్ల ధాన్యం నిల్వలు తడిసి పోకుండా వాతావరణ పరిస్థితుల గురించి క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది ముందస్తుగానే రైతులకు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు తెలియజేస్తూ వారిని అప్రమత్తం చేయాలన్నారు. మరో రెండు వారాల పాటు ధాన్యం సేకరణ ప్రక్రియ కొనసాగనున్న దృష్ట్యా, ఎలాంటి ఇబ్బందులకు ఆస్కారం లేకుండా సాఫీగా కొనుగోళ్లు పూర్తయ్యేలా అధికారులు అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సన్న బియ్యం పంపిణీలో ఎలాంటి అవాంతరాలు లేకుండా పర్యవేక్షణ జరపాలని, నాణ్యమైన బియ్యం పంపిణీ జరిగేలా చూడాలని అధికారులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు.

# సరస్వతి పుష్కరాలు అద్భుతం

## పుష్కర స్నానంతో సకల సౌకర్యాలు, సౌభాగ్యాలు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

సరస్వతి నదిలో పుణ్య స్నానాలు ఆచరించిన ఉప ముఖ్యమంత్రి



**మహా:** కాళేశ్వరం సరస్వతి నది పుష్కరాలు అద్భుతం, అనిర్వచనీయమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆయన శుక్రవారం కాళేశ్వరంలో కుటుంబ సమేతంగా సరస్వతి తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సరస్వతి పుష్కర స్నానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుష్కరాలు నిర్వహణ అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. కాలేశ్వరంలో సరస్వతీ పుష్కర ఏర్పాట్లు అద్భుతంగా, అనిర్వచనీయంగా ఉన్నాయన్నారు. పుష్కర స్నానంతో సకల సౌకర్యాలు, సౌభాగ్యాలు కలుగుతాయని ఏవైనా పొరపాట్లు, తప్పులు జరిగి ఉంటే పుష్కర స్నానంతో అవి పరిసమాప్తం అవుతాయని అన్నారు. కుటుంబంతో కలిసి సరస్వతి పుష్కర స్నానం ఆచరించడం గొప్ప అదృష్టంగా భావిస్తున్నానని డిప్యూటీ సీఎం అభిప్రాయం వ్యక్తం చేశారు. 12 రోజుల పాటు జరగనున్న పుష్కరాలకు ఏర్పాట్లు అద్భుతంగా చేశారని, వేలాదిగా భక్తులు తరలి వస్తున్నారని రానున్న 10 రోజులు చాలా కీలకమని అన్నారు. మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలో ఎక్కడా చిన్న లోపం రాకుండా భక్తులందరికీ సకల సౌకర్యాలు ఏర్పాటు చేశారని అన్నారు. లక్షలాది మంది భక్తులు వచ్చినా ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు ఉన్నాయని తెలిపారు. భక్తులు సౌకర్యాలు కల్పనకు ఏర్పాటు చేసిన టెంట్ సిటీ అద్భుతంగా ఉందని అభినందించారు. భద్రత, పారిశుద్ధ్యం, స్నానాల ఘాట్ల వద్ద ఏర్పాట్లను అధికారులు నిబద్ధత, నిష్టతో ఏర్పాటు చేశారని వివరించారు.

# ట్రైలర్ మాత్రమే.. ఇంకా సినిమా ముందుంది

## ఆపరేషన్ సిందూర్ ముగియలేదు

- రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్
- భుజ్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ సందర్శించిన కేంద్రమంత్రి



**మహా:** ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఈ ఆపరేషన్‌తో ట్రైలర్ మాత్రమే చూశారని, సినిమా ముందుందని తీవ్రంగా హెచ్చరించారు. భుజ్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌ను శుక్రవారం రాజ్‌నాథ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఎయిర్ వారియర్స్ తో సంభాషించారు. అనంతరం అక్కడ ప్రసంగించారు. 'ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు. ఇప్పటి వరకూ ఏదైతే చూశారో అది కేవలం ట్రైలర్ మాత్రమే. సరైన సమయంలో ప్రపంచం మొత్తానికి పూర్తి సినిమా చూపిస్తాం' అని వ్యాఖ్యానించారు. 'పాకిస్థాన్ పెంచి పోషిస్తున్న ఉగ్రవాదాన్ని 'ఆపరేషన్ సిందూర్'తో భారత్ 23 నిమిషాల్లోనే తుడిచిపెట్టేసింది. త్రివిధ దళాల పరాక్రమం చూసి యావత్ భారతావని గర్విస్తోంది. ఈ ఆపరేషన్‌తో భారత్ సైనిక సత్తా ప్రపంచ దేశాలకు తెలిసింది. పాక్‌లోని ప్రతి మూలకూ వెళ్లే సామర్థ్యం మన వైమానిక దళానికి ఉంది. ఆపరేషన్ సిందూర్‌తో అది నిరూపితమైంది. ఈ ఆపరేషన్‌తో మన వైమానిక సామర్థ్యాన్ని పాక్ ప్రత్యక్షంగా చూసింది. పాకిస్థాన్ నేలపై ఉన్న 9 ఉగ్ర స్థావరాలను మన మిలిటరీ ధ్వంసం చేసిన దృశ్యాలను యావత్ ప్రపంచం తిలకించింది. బ్రహ్మోస్ మిస్సైల్ శక్తికి పాక్ వణికిపోయింది' అని రాజ్‌నాథ్ తెలిపారు.



# ఆదిభట్లలో గంజాయి చాక్లెట్ల కలకలం


- ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో విక్రయం
- 810 గ్రాముల గంజాయి చాక్లెట్ల స్వాధీనం
- ఇద్దరు నిందితుల అరెస్టు రిమాండ్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి చాక్లెట్ల కలకలం చెలరేగింది. శుక్రవారం గంజాయి చాక్లెట్లు తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆదిబట్ల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన చోటు చేసుకుంది. ఆదిభట్ల పోలీసులు తెలిపిన వివరాలు తెలిపిన ప్రకారం. రాజస్థానుకు చెందిన షర్వాన్ కుమార్ అనే వ్యక్తి తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడలో పాన్‌షాప్ నిర్వహించే వాడని, గత నాలుగు నెలలుగా రాజస్థాన్ నుండి గంజాయి చాక్లెట్లు కొనుగోలు చేసి వాటిని కూలీలకు విక్రయిస్తున్నాడని తెలిపారు. ఈ క్రమంలో ఒడిషా రాష్ట్రానికి చెందిన అజిత్ సర్దార్‌తో అనే వ్యక్తితో పరిచయం ఏర్పడిందని, ఇద్దరు కలిసి గంజాయి, గంజాయి చాక్లెట్లను గుట్టు చప్పుడు కాకుండా అమ్మేవారని, షర్వాన్ కుమార్ రాజస్థాన్ నుండి గంజాయి చాక్లెట్లు తీసుకు వచ్చి, మరో వ్యక్తి బినోద్ సర్దార్కు ఇస్తే, తాను చుట్టు పక్కల నివాసం ఉండే వలస కార్మికులకు అమ్మడానికి, ఇద్దరు కలిసి పథకం వేసుకున్నట్లు తెలిపారు. ఐదు డబ్బాలలో 810 గ్రాముల గంజాయి చాక్లెట్లను, షర్వాన్ కుమార్ రాజస్తాన్ నుండి తీసుకు వచ్చి, నాదర్‌గుల్ ఇండస్ట్రీయల్ ఏరియా టాటా అడ్వాన్స్ సిస్టమ్ దగ్గర బినోద్ సర్ధార్‌కు ఇస్తుండగా ఆదిబట్ల పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 810 గ్రాముల గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకుని రిమాండ్ కు తరలించామని పోలీసులు తెలిపారు.

# పవన్ ఫ్యాన్స్ బీ రెడీ

## డిప్యూటీ సీఎం సినిమా రిలీజ్ డేట్ ఫిక్స్

జూన్ 12న హరిహరవీరమల్లు



**మహా:** పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'హరిహర వీరమల్లు' విడుదల తేదీ ఖరారైంది. ఈ భారీ బడ్జెట్ సినిమాను జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్ర బృందం నేడు అధికారికంగా ప్రకటించింది. పవన్ కళ్యాణ్ ఈ చిత్రంలో వీరమల్లు అనే యోధుడి పాత్రలో కనిపించనున్నారు. పవన్ నుంచి చాలాకాలం తర్వాత ఓ సినిమా వస్తుండడంతో, హరిహర వీరమల్లు సినిమాపై అంచనాలు అమాంతం పెరిగాయి. ప్రస్తుతం 'హరిహర వీరమల్లు' సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దర్శకుడు ఎ.ఎం. జ్యోతి కృష్ణ ఈ ప్రాజెక్టు బాధ్యతలు చేపట్టి, సినిమాను అనుకున్న విధంగా తీర్చిదిద్దడంలో అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి అందిస్తున్న సంగీతం, మనోజ్ పరమహంస సినిమాటోగ్రఫీ, తోట తరణి ప్రొడక్షన్ డిజైన్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణలుగా నిలవనున్నాయి. ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్‌తో పాటు బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ మొఘల్ చక్రవర్తి పాత్రలో ప్రతినాయకుడిగా నటిస్తుండగా, నిధి అగర్వాల్ కథానాయికగా కనిపించనుంది. తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఏకకాలంలో విడుదల కానున్న 'హరిహర వీరమల్లు' చిత్రం, బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించడానికి సిద్ధమవుతోంది.

EDITORIAL సంపాదకీయం

# అమరావతి రైతుల కృషి


దాదాపు ఒక వేయి ఆరువందల ముప్పై ఒక్క రోజులు అమరావతి లోని రైతులు చేసిన ధర్నాలు, పోరాటాలు, వినూత్న నిరసనలు చేసిన రైతులు అభినందనీయులు వారి కృషి, మొక్కవోని దీక్ష ఫలించింది. ఆనాటి ప్రభుత్వం అక్కడి రైతులను హింసించి, అవహేళనలకు గురి చేసింది. అమరావతిని పూర్తిగా గత ప్రభుత్వం విస్మరించింది. వివిధ కట్టడాలు, అక్కడ ఉపయోగించిన పరికరాలు పూర్తిగా తుప్పు పట్టాయి. పిచ్చి మొక్కలతో ఓ చిట్టడవిని తలపిస్తోంది. నిర్మాణాలు సగంలోనే ఆగిపోయాయి. మూడు రాజధానులు పేరుతో అమరావతి పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. అక్కడ రైతులు ఇచ్చిన భూములు భ్రష్టు పట్టిపోయాయి. అయినా కూడ రైతులు వివిధ రూపాలలో పట్టు సడలకుండా పోరాడరు. వారి పోరాటాన్ని అప్పటి ప్రభుత్వం లోని నాయకులు ' పెయిడ్ ఆర్టిస్టులు 'అని పలు ఇబ్బందులకు గురి చేశారు. అమరావతిని రాజధానిగా ప్రకటించడానికి వారికి మనసొప్పలేదు. అలానే కాలయాపన చేశారు. 151 యం. యల్. ఏలు ఏ ఒక్కరు కూడ అమరావతి గురించి మాట్లాడలేదు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గారు మూడు రాజధానులు ఏర్పాటు చేస్తామని ప్రకటించడం తో అందరిలో కలవరం మొదలయింది. అంత వరకు అమరావతికి అండగా ఉంటామని అప్పటి ప్రతిపక్ష నాయకుడు జగన్ పలికిన మాటలు నిర్వీర్యం అయ్యాయి. మాట తప్పడం అంటే ఇదే. అమరావతికి ఊపిరి పోసిన నారా చంద్రబాబు నాయుడు గారు కొన్ని కట్టడాలు కట్టారు. వాటిని చూసి వై. యస్. ఆర్. పార్టీ వారు గ్రాఫిక్స్ అన్నారు. దానికి తోడు అమరావతి గురించి వై. యస్. ఆర్. పార్టీ వాళ్ళు ఏమి మాట్లాడకపోవడం శోచనీయం. వాస్తవానికి వాళ్ళు జగన్ చూసి భయపడి పోయినట్లు ఉన్నారు. వాళ్ళ పార్టీ వాళ్ళల్లోనే మూడు రాజధానులు ఇష్టం లేదు. పేరుకే విశాఖ అని, అదిగో, ఇదిగో అంటూ జనాలను మభ్య పెట్టి, తప్పు దారి పట్టించి ఏ మాత్రం ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా వై. యస్. ఆర్ ప్రభుత్వం ఏక పక్షంగా వ్యవహరించింది. నిజానికి విశాఖ వాసులకే మాకు రాజధాని ఇష్టం లేదు అనే ధోరణిలో ఉన్నారు. విశాఖకు రావాల్సిన కొన్ని మల్టి కంపెనీలు కూడ వెనక్కి తగ్గాయి. అయినా అప్పటి ప్రభుత్వం లో చలనం లేదు. ఒక ప్రక్క అమరావతిలో రైతుల పోరాటం సడలలేదు. జగన్, మరియు వారి పార్టీ సభ్యులు ఆటంకాలు సృష్టించిన అమరావతి రైతులు పోరాటాలు ఆపలేదు. అక్కడ తెలుగు దేశం పార్టీ వాళ్ళ భూములు ఉన్నాయని తప్పుడు ప్రచారం చేశారు. తెలుగు దేశం నాయకులు లాభం పొందడానికి భూములు రైతులు ఇచ్చారని ప్రకటనలు చేశారు. అదే విషయం విశాఖ లో వై. యస్. ఆర్ వాళ్ళు భూములు ఉన్నాయని చెబితే రాజకీయ రంగు పులుమతున్నారని ఆ పార్టీ వాళ్ళు చెప్పటం వింతగా ఉంది. ఇలా అమరావతి ని ప్రజల రాజధాని అని కాకుండ, భ్రమరావతి అని వై. యస్. ఆర్ పార్టీ వాళ్ళు ఎద్దేవా చేశారు. అయినా కూడ రైతులు పట్టు వీడక, ఎన్నో అవమానాలు భరించి అమరావతి ని సాకారం చేసుకున్నారు. ఇక అక్కడ ఎవరూ కూడ ఏమి చేయలేరు. అధికారం లోకి వచ్చిన తెలుగు దేశం ప్రభుత్వం రాజధాని పునర్ నిర్మాణానికి దారులు వేస్తోంది. ముఖ్యంగా రైతులను అభినందించింది. ఆంగ్ల అక్షరం లో 'ఎ ' అంటే అమరావతి అని చెబుతోంది. ఇప్పుడు అమరావతి నిజంగా ప్రజారాజధానే. త్వరలో శరవేగంగా పనులు జరిపి అందుబాటులోకి తీసుకు రావాలి అనే తలంపుతో కొత్త ప్రభుత్వం ఉంది. ఇక ఏ శక్తి అమరావతిని అడ్డుకోలేదు. ఒక నిరంకుశం నుంచి అది బయట పడింది. ఇందుకు కారణం అమరావతి కోసం భూములు ఇచ్చిన రైతుల కృషి. వారి ఆచరణాత్మక పోరాటం, ఐక్యంగా సాగిన సమైక్యత ఈనాడు వారి కోరిక ఫలించింది. భవిష్యత్ లో అమరావతి ఒక పర్యాటక ప్రాంతం గా కూడ ఉండవచ్చు. అలా అద్భుత నిర్మాణం జరుగుతుంది. అప్పుడు సంపద అదే వస్తుంది. అదే నారా వారి ఆలోచన. సంపద సృష్టించాలి, అభివృధి జరగాలి, సంక్షేమం పరుగులు తీయాలి. ఇవి బాగా తెలిసిన వ్యక్తి మన నవ్యంధ్ర నిర్మాత శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు. అతి త్వరలో అమరావతి ఒక అత్యద్భుత కట్టడం గా చరిత్రలో నిలిచిపోతుందని ఆశీద్దాం. మరోసారి అమరావతి రైతులకు అభినందనలు.



**- కనుమ ఎల్లారెడ్డి,**
**తాడిపత్రి, 93915 23027.**

# భారీగా పెరిగిన రక్షణశాఖ బడ్జెట్


ఆపరేషన్ సిందూర్ అనంతరం భారత రక్షణ శాఖను మరింత బలోపేతం చేయడంపై కేంద్రం ఫోకస్ పెట్టింది. అందులో భాగంగా 2025 25 ఆర్థిక సంవత్సరంలో ప్రతిపాదించిన పద్దు కంటే డిఫెన్స్ బడ్జెట్‌ను మరో రూ.50వేల కోట్లను పెంచే యోచనలో కేంద్రం ఉంది. ఇందుకోసం పార్లమెంట్ శీతాకాల సమావేశంలో రూ.50వేల కోట్లకు సంబంధించిన సప్లిమెంటరీ పద్దును కేంద్రం ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. ఆపరేషన్ సిందూర్ తర్వాత రక్షణ బడ్జెట్లో సాంకేతిక పరిజ్ఞానం, మందుగుండు సామగ్రి కొనుగోలు, కొత్త ఆయుధాల ఖర్చులను దృష్టిలో ఉంచుకుని కేంద్రం ఈ మేరకు ఆలోచన చేసినట్లు వార్తలు వస్తున్నవి. ఇది మంచి పరిణామం. సాయుధ దళాల అవసరాలు, పరిశోధన అభివృద్ధి కోసం ఈ రూ.50వేల కోట్లను కేటాయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సంవత్సరం, కేంద్ర బడ్జెట్ లో రక్షణ కోసం రికార్డు స్థాయిలో రూ. 6.81 లక్షల కోట్లను ప్రతిపాదించారు. ఇది దేశవార్షిక బడ్జెట్ లో 13.45శాతం. గత ఆర్థిక సంవత్సరం కంటే 9.53% ఎక్కువ. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి, గత 10 సంవత్సరాలలో రక్షణ బడ్జెట్ దాదాపు మూడు రెట్లు పెరిగింది. అయితే 201415 బడ్జెట్లో రక్షణ రంగానికి రూ. 2.29 లక్షల కోట్లు కేటాయించారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా తొమ్మిది ఉగ్రవాద శిబిరాలను సరిహద్దు దాటకుండానే భారత్ ధ్వంసం చేసింది. దీంతో పాకిస్థాన్‌పై భారత్ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఉద్రిక్తతల సమయంలో భారతదేశ వాయు సేన స్వదేశీ సాంకేతికతతో పాక్ ప్రయోగించిన దాదాపు అన్ని క్షిపణులను, డ్రోన్లను గాల్లోనే ధ్వంసం చేసింది. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మే 12న కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఈ ఆపరేషన్ సమయంలో మేడ్ ఇన్ ఇండియా ఆయుధాలను ప్రపంచం గుర్తించింది. మన దేశంలో ఉత్పత్తి అవుతున్న ఆయుధాలపై విశ్వసనీయత పెరిగింది. 21వ శతాబ్దపు యుద్ధంలో మేడ్ ఇన్ ఇండియా రక్షణ పరికరాలకు టైమ్ వచ్చింది"అని ప్రధానమంత్రి మోదీ ఉద్ఘాటించారు. ఈ నేపథ్యంలో దేశీయ రక్షణ ఉత్పత్తులను పెంచడంతో పాటు మరిన్ని అభివృద్ధి చేసే అంశంపై కేంద్రం దృష్టి సారించింది. గత పదేళ్లలో రక్షణ ఎగుమతులు దాదాపు పది శాతం పెరిగాయి. ఉత్పత్తులు పెంచడం ద్వారా భవిష్యత్‌లో ఎగుమతులను పెంచుకునే యోచనలో మోదీ సర్కార్ ఉన్నట్లు తెలుస్తోంది. రక్షణరంగంలో భారత్ అద్భుత పురోగతిని దీని ద్వారా సాధిస్తుంది. మేడ్ ఇన్ ఇండియా ఆయుధాలకు టైమ్ వచ్చిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యలు దీని ద్వారా ముందడుగు పడుతాయి.



# బ్రహ్మోస్ ముందు అందరూ బలాదూర్

## పాక్, చైనా రక్షణ వ్యవస్థలు పనికిరావంటున్న రక్షణశాఖ

**మహా:** పాకిస్థాన్‌లోని ఏ ప్రాంతంపైనైనా దాడి చేయగలమనే స్పష్టమైన సందేశాన్ని ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ తెలియజేసిందని అమెరికా మాజీ సైనికాధికారి, యుద్ధ నిపుణుడు జాన్ స్పెన్సర్ అభిప్రాయపడ్డారు. బ్రహ్మోస్ క్షిపణుల ముందు పాకిస్థాన్ గగనతల రక్షణ వ్యవస్థలు తేలిపోయాయని ఓ జాతీయ సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న దేశాలకు ఆపరేషన్ సిందూర్ ఒక కేస్ స్టడీగా నిలుస్తుందని అన్నారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కు ప్రపంచ దేశాలు తగిన రీతిలో బుద్ధి చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.




**బ్రహ్మోస్ ముందు పాక్, చైనా క్షిపణులు పిల్లకాకులు**

పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌పై అమెరికా మాజీ సైనిక అధికారి కల్నల్ జాన్ స్పెన్సర్ ఓ జాతీయ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన అభిప్రాయాలను పంచుకున్నారు. పాకిస్థాన్ వినియోగిస్తున్న చైనా తయారీ గగనతల రక్షణ వ్యవస్థలు బ్రహ్మోస్ క్షిపణుల ముందు తేలిపోయాయని అన్నారు. దాయాది దేశానికి చెందిన గగనతల రక్షణ వ్యవస్థలను ధ్వంసం చేయటం భారత అధునాతన సైనిక సామర్థ్యాలకు నిదర్శనమని అభిప్రాయపడ్డారు. పాకిస్థాన్ వినియోగించిన చైనా క్షిపణులను ఆ దేశ గగనతలంలోనే కూల్చివేయటం భారత వాయుసేన సమర్థతను తెలియజేస్తోందని అన్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ తన లక్ష్యాలను చేరుకోవటంతో పాటు పాకిస్థాన్ దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టిందని చెప్పారు. భారత్ దాడుల్లో పాకిస్థాన్ సైన్యానికి భారీ నష్టం వాటిల్లిందని తెలిపారు. ఉగ్రవాదుల లక్ష్యంగా భారత్ చేపట్టిన దాడికి ప్రతీగా పాకిస్థాన్ డ్రోన్లు, క్షిపణులను ప్రయోగించటం సరైన చర్య కాదని అన్నారు.

**ఇదో కేస్ స్టడీ!**


ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న దేశాలకు ఆపరేషన్ సిందూర్ ఒక కేస్ స్టడీగా నిలుస్తుందని జాన్ స్పెన్సర్ అభిప్రాయపడ్డారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కు ప్రపంచ దేశాలు తగిన రీతిలో బుద్ధి చెప్పాలని డిమాండ్ చేశారు. పాకిస్థాన్‌పై ఇకనైనా పశ్చిమ దేశాలు రెండు నాలుకల ధోరణిని వీడనాడాలని హితవు పలికారు. సింధూ జలాల ఒప్పందాన్ని రద్దు చేస్తూ భారత్ తీసుకున్న నిర్ణయాన్ని ఆయన సమర్థించారు. భారత చర్య పాక్‌ను సందిగ్ధంలో పడేస్తుందని అభిప్రాయపడ్డారు.

**దూసుకెళ్లిన భారత రక్షణ రంగ షేర్లు**

ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత్ దేశీయంగా తయారు చేసిన ఆయుధాలను వినియోగించి ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయటంతో ఆ రంగ షేర్లు దూసుకెళ్తున్నాయి. గత మూడు రోజుల్లో నిఫ్టీ డిఫెన్స్ ఇండెక్స్ 10 శాతానికిపైగా పెరిగింది. వారం రోజుల్లో కొచ్చిన్ షిప్‌యార్డు, బీడీఎల్, మజ్‌గావ్ డాక్ షిప్‌బిల్డర్స్ షేర్లు 10 నుంచి 35 శాతానికిపైగా పెరిగాయి. అదే సమయంలో పాకిస్తాన్ ఉపయోగించిన చైనా ఆయుధాలు, గగనతల రక్షణ వ్యవస్థలు సరైన పనితీరు కనబర్చలేకపోవడంతో చైనాకు చెందిన రక్షణ రంగ షేర్లు ఐదు నుంచి పది శాతం పడిపోయాయి.

# సెల్ఫ్ గోల్ మంత్రి

## సర్కారుకు తలనొప్పులు



కొండా సురేఖ.. తరచూ సెల్ఫ్ గోల్ చేసుకుంటూ సర్కారుకు తలనొప్పులు తెచ్చిపెడుతున్నారు. సోషల్ మీడియా యుగంలో.. మాటలు దొర్లితే ఎంత డేంజరో తెలిశాక కూడా అనేక అనుభవాలు ఉన్నాక కూడా గొప్పలకు పోయి తాను సెల్ఫ్ గోల్ చేసుకోవడమే కాకుండా సహచరులను కూడా ఇబ్బందుల్లోకి నెట్టేస్తున్నారన్న చర్చ జరుగుతోంది. తాను మంచి మంత్రిని అని చెప్పబోయి.. ఇతర మంత్రులు ఫైల్స్, డబ్బులు అన్న ప్రస్తావన అసందర్భంగా తేవడంతో మళ్ళీ వరంగల్లు.. ఢిల్లీ లో మోగింది. నాగార్జున సమంత ఎపిసోడ్ లోనే ఢిల్లీ దాకా.. పెద్ద లొల్లి, ఫిర్యాదులు రాగా, రాజీనామా ప్రచారం కూడా జరిగింది. ఆ గండం నుండి ఎలాగోలా బయటపడ్డారు. ఆ తర్వాత కూడా తరచూ రీల్స్ కు, ప్రతిపక్ష సోషల్ మీడియాకు ప్రధాన కంటెంట్ గా తన ప్రసంగాలు మారిపోతున్నాయి. అటు సర్కారుకు, ఇటు పార్టీకి కొండా సురేఖ ఉద్దేశపూర్వకంగా చేయకపోయినా ఇబ్బందులు తెచ్చిపెడుతున్నారు. బాధ్యతాయుతమైన మంత్రి స్థానంలో ఉన్నప్పుడు ఆచితూచి మాట్లాడాల్సి ఉంటుంది. దీనికి భిన్నంగా రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తీరు ఉంది. తన గొప్పదనం చాటుకునేందుకో.. హైకమాండ్ మెప్పు పొందేందుకోగానీ.. ముందూవెనుకా ఆలోచించకుండా ఆమె మాట్లాడుతున్న మాటలు సెల్‌ఫ్‌గోల్‌గా తయారవుతున్నాయి. ఫైర్ బ్రాండ్ నేతగా ముద్రపడిన కొండా సురేఖ.. మారిన పరిస్థితులను అర్థం చేసుకోకుండా తాను పై చేయి సాధించేందుకు చేస్తున్న ప్రయత్నాలు కాస్తా తిరగబడుతున్నాయి. అవి ప్రతిపక్షాలకు ఆయుధాలుగా మారుతున్నాయి. గతంలో బీఆర్‌ఎస్ నాయకుడు కేటీఆర్ పై విమర్శలు చేస్తూ.. చేస్తూ మధ్యలో నటుడు నాగార్జున కుటుంబాన్ని, నటి సమంతను వివాదంలోకి లాగారు. సురేఖ చేసిన వ్యాఖ్యలు, ఆరోపణలు జుగుప్సాకరంగా ఉండటంతో అవి తీవ్రస్థాయిలో బూమరాంగ్ అయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ఆమెపై విమర్శలు వెల్లువెత్తాయి. నాగార్జున కోర్టును ఆశ్రయించడంతో మంత్రి స్థానంలో ఉంటూ కోర్టులో కేసు ఎదుర్కోవాల్సిన పరిస్థితి సురేఖకు ఏర్పడింది. తాజాగా ఫైళ్ల క్లియరెన్స్ లో మంత్రులు డబ్బులు తీసుకుంటారన్నట్లుగా ఆమె మాటలు ఉండటం సర్కారుకు కొత్త తలనొప్పిని తెచ్చిపెట్టింది.

## అదేం సందర్భం?

వరంగల్ నగరంలోని బాలికల కాలేజీ నూతన భవన నిర్మాణానికి అరబిందో సంస్థ సహకారంతో గురువారం శంకుస్థాపన చేసిన సందర్భంగా మాట్లాడిన సురేఖ.. కొత్త వివాదానికి ఆజ్యం పోశారు. మంత్రుల వద్దకు పలు కంపెనీలు ఫైళ్ల క్లియరెన్స్ కోసం వస్తుంటాయని, అలాంటి వాళ్ళ దగ్గర మంత్రులు డబ్బులు తీసుకుంటారని, తాను మాత్రం కాలేజీ భవన నిర్మాణానికి సహకరించాలని కోరానని, దీంతో అరబిందో కంపెనీ కాలేజీ భవన నిర్మాణానికి నాలుగున్నర కోట్లు ఇచ్చిందని తన గొప్ప చెప్పకోబోయారు. ఇతర మంత్రులు పనుల కోసం డబ్బులు తీసుకుంటున్నట్లు అర్థం వచ్చేలా మంత్రి మాటలు స్పష్టంగానే ఉండటంతో గందరగోళం చెలరేగింది. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం కమీషన్ల ప్రభుత్వంగా మారిందని, 20 నుంచి 30 శాతం కమీషన్లు మంత్రులు తీసుకుంటున్నారని ప్రతిపక్ష పార్టీ నాయకులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఇప్పడు అదే తరహాలో కొండా సురేఖ మాట్లాడటంతో.. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కేటీఆర్, కిషన్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కమీషన్ల ప్రభుత్వంగా అభివర్ణించారు. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్న చందంగా.. వాటికి వివరణ ఇచ్చుకున్నా.. అప్పటికే ప్రభుత్వం డిఫెన్స్‌లో పడిపోయింది. దీనంతటికీ సురేఖ మాట్లాడిన తీరే కారణమనే విమర్శలు కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్నారు. గతంలో సమంత విషయంలో కూడా ఇదేవిధంగా నోరు జారిందని కాంగ్రెస్ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
9247580946

# ప్రమాదంలో లక్షల మంది విద్యార్థులకు భవితవ్యం

**టిఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు ఎం లక్ష్మీనివాస్**

రూ.8,000 కోట్లకు చేరిన బకాయిలు

సంక్షోభంలో చిక్కుకున్న ప్రైవేటు కాలేజీలు

లెక్చలర్లకు వేతనాలు చెల్లించలేని పరిస్థితి నెలకొంది

రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే బకాయిలు చెల్లించాలి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:**

ఫీజు రియంబర్స్ మెంట్ పథకం అమలుపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య పూరిత దోరణితో లక్షల మంది పేద విద్యార్థుల భవితవ్యం ప్రమాదంలో పడిందని టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో దాదాపు రూ.8,000 వేల కోట్లకు పెరిగిపోయిన ఫీజు రియంబర్స్ మెంట్ తక్షణం చెల్లించాలంటూ శుక్రవారం ఆమనగల్లులో విలేకరులతో వెల్లడించారు. ఇకపై అన్ని నిర్ణీత కాల పట్టిక ప్రకారం వాయిదాలు కుండా చెల్లింపులకు చర్యలు తీసుకోవాలని కోరారు. రియంబర్స్ మెంట్ బకాయిలతో సంక్షోభంలో చిక్కుకున్న ప్రైవేటు కాలేజీలు, అధ్యాపకులకు వేతనాలు చెల్లించలేని దుస్థితి నెలకొందన్న లక్ష్మీనివాస్. వేల సంఖ్యలో కాలేజీలు అప్పులతో మూత పడుతున్నాయని గుర్తు చేశారు. కోర్సులు పూర్తిచేసిన పేద విద్యార్థులు సర్టిఫికెట్లు అందక, ఉద్యోగాలకు దరఖాస్తు చేయలేక, ఉన్నత విద్య అభ్యసించలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు.

**విద్యార్థులకు కాలేజీ యాజమాన్యానికి మధ్య గర్షణ...**

కాలేజీ యాజమాన్యాలకు, విద్యార్థులకు మధ్య జరిగిన గొడవలు పోలీస్ స్టేషన్ ల వరకు వెళుతున్న పట్టించుకోరా? అని రాష్ట్ర సర్కారును నిలదీశారు. 'ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు ఓటీఎస్ కింద సెటిల్ చేయాలని డిమాండ్ చేశారు.

**అసెంబ్లీ సమావేశాలలో...**

విద్యా సంవత్సరం ప్రారంభంలోనే ఆ విద్యా సంవత్సరానికి చెల్లించాల్సిన మొత్తాన్ని చెల్లిస్తామని, గతంలో జేఎన్టీయూలో, అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు' అని టిఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీనివాస్ గుర్తు చేశారు. తక్షణమే ఫీజు బకాయిలు చెల్లించకపోతే తదుపరి పరిణామాలకు ప్రభుత్వానిదే బాధ్యత అని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మీసాల వంశీ, రాష్ట్ర కోఆర్డినేటర్ సుదర్శన్, సోషల్ మీడియా ఇన్చార్జ్ చిక్కి, సందీప్, టిఎస్ఎస్ఓ ఆమనగల్ మండల కమిటీ పాల్గొన్నారు..

# భూభారతి సదస్సుల్లో దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

**ప్రజలు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి.. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

**కరీంనగర్, మహా:**

భూభారతి కొత్త ఆర్.ఓ.ఆర్ చట్టం అమల్లో భాగంగా పైలెట్ మండలం సైదాపూర్ లోని వివిధ గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన అర్జీలను వెనువెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం వి. సైదాపూర్ మండలంలోని సైదాపూర్ గ్రామపంచాయతీలో, వెన్కపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతుల నుండి స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పరిష్కారానికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సైదాపూర్ మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన నేపథ్యంలో, భూ సమస్యలు ఉన్నవారు రెవెన్యూ సదస్సులో పాల్గొని దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. దరఖాస్తులు స్వీకరించి నూతన చట్టం ప్రకారం భూ



సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలో ప్రజలు తహసీల్దార్,ఆర్డీఓ లేదా కలెక్టర్ కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేదని, కానీ ఇప్పుడు అధికారులు స్వయంగా గ్రామాలకే వచ్చి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలులోకి తెచ్చిన భూభారతి చట్టం కింద రైతులు, ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ చేయాలని కలెక్టర్ రెవెన్యూ బృందాలను ఆదేశించారు. భూ భారతి పైలెట్ ప్రాతిపాదికన గ్రామాలలో నిర్వహించిన రైతు సదస్సుల సందర్భంగా వచ్చిన దరఖాస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, నూతన ఆర్ఓఆర్ చట్టంలో పొందుపర్చిన నిబంధనలకు అనుగుణంగా భూ సమస్యలు పరిష్కరించాలని అన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, భూభారతిలోని నిబంధనలపై అధికారులు పరిపూర్ణమైన అవగాహనను కలిగి ఉన్నప్పుడే, తప్పిదాలకు తావులేకుండా ఉంటుందని తెలిపారు. పూర్తి అవగాహనతో దరఖాస్తుల పరిశీలన, విచారణ, పరిష్కారం చేయాలని అధికారులను ఆదేశించారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ప్రభుత్వ సంకల్పం నెరవేరేలా రెవెన్యూ అధికారులు, సిబ్బంది అందరూ అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సదస్సులో తహసిల్దార్లు కనుకయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.



# వెస్ట్ జోన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లను సందర్శించిన సీపీ

**రౌడీ షీటర్ల పై ప్రత్యేక దృష్టి సారించాలి**

**హన్మకొండ మహా;** వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ శుక్రవారం వెస్ట్ జోన్ పరిధిలోని చిల్పూర్, తరిగొప్పుల, నర్మెట్ట ,జనగామ పోలీస్ స్టేషన్లతో పాటు వెస్ట్ జోన్ డిసిపి కార్యాలయాన్ని సందర్శించారు. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం తోలిసారిగా వెస్ట్ జోన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల ను సందర్శించిన పోలీస్ కమిషనర్ ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, సిసి కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది వివరాలను సిపి సంబంధిత స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌ను అడిగి తెలుసుకొవడంతో పాటు, స్టేషన్ల పరిధిలో అత్యధికంగా ఎలాంటి నేరాలు నమోదవుతాయని స్టేషన్ పరిధిలో ఎన్నిసెక్టార్లు వున్నాయి, సెక్టార్‌వారిగా ఎస్ ఐలు నిర్వహిస్తున్న విధులు, వారి పరిధిలోని రౌడీ షీటర్లు, అనుమానితులు వారి ప్రస్తుత స్థితి గతులను సంబంధిత సెక్టార్ ఎస్.ఐని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా స్టేషన్‌వారిగా బ్లూకోల్ట్స్ సిబ్బంది పనితీరుతో పాటు, వారు విధులు నిర్వహించే సమయాలను పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులకు పలుసూచనలు చేస్తూ ప్రతి స్టేషన్ అధికారి తప్పనిసరిగా రౌడీ ఇండ్లను సందర్శించి వారి స్థితిగతులపై ప్రత్యక్షంగా ఆరా తీయాలని, ఆర్థిక సైబర్ నేరాలకు సంబంధించి కేవలం కేసు నమోదు చేయడమే తమ బాధ్యతనే కాకుండా సైబర్ నేరాలకు సంబంధించి నేరానికి పాల్పడిన నేరస్థుల మూలాలు కూడా దర్యాప్తు అధికారులు కనిపెట్టి నిందితులను అరెస్టు చేయాలని. ట్రై సిటి పరిధిలో గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాలకు సంబంధించి క్రయ విక్రయాలపై స్టేషన్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మత్తు పదార్థాల నియంత్రణకై నిరంతరం పనిచేయాలని. నేరాల నియంత్రణకై విజుబుల్ పోలీసింగ్ అవసరమని, ఇందుకోసం నగరంలో నిరంతం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించాలని పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులకు సూచించారు.



## సమావేశ ప్రాంగణాన్ని ప్రారంభించిన పోలీస్ కమిషనర్

జనగామ ఏసిపి కార్యాలయములో నూతనంగా నిర్మించిన వెస్ట్ పోలీస్ అధికారుల సమావేశ ప్రాంగణాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ప్రారంభించారు. అనంతరం ఈ సమావేశ ప్రాంగణంలో పోలీస్ కమిషనర్ పండ్ల మొక్కలను నాటారు. పోలీస్ కమిషనర్ వెంట డీసీపీ రాజమహేంద్ర నాయక్, జనగామ ఏఎస్పీ చైతన్య నితిన్, ఏసిపిలు భీం శర్మ,నర్సయ్య ఇన్‌స్పెక్టర్లు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్.ఐలు పాల్గోన్నారు.

# గోవులను వధించే వారిని కఠినంగా శిక్షించాలి

**గోరక్ష రాష్ట్ర కమిటి మెంబర్ ఉట్కూరి రాధాకృష్ణారెడ్డి**

**కరీంనగర్ మహా:**

దేశీ గో వంశరక్షణ సంవర్ధన సమితి తెలంగాణ గోరక్ష విభాగం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హుజురాబాద్ తహసిల్దార్, సీఐ ల కు గోవులను వధించే వారిని కఠినంగా శిక్షించాలని వినతిపత్రమును గోరక్ష రాష్ట్ర కమిటి మెంబర్ ఉట్కూరి రాధాకృష్ణారెడ్డి అందజేశారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సకల దేవత స్వరూపం గోమాత వేదకాలం నుండి గోవును ఆరాధ్య దేవతగా పూజిస్తున్నాం దేశ ఆర్థిక వ్యవస్థ పరిస్థితులతో మొదలుకొని పర్యావరణ పరిరక్షణ వ్యవసాయంతో పాటు మానవాళి ఆరోగ్య రక్షణకు గోమాత ఆధారం అలాంటి గౌరవం ప్రస్తుతం విచ్చలవిడిగా వధించి మాంసాహారంగా ఉపయోగించుకుంటున్నారు వేలాది టన్నుల గోమాంసాన్ని విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు గోవును కాపాడుకోవాలని ఉద్దేశంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1977 సంవత్సరంలో గోవధ నిషేధ చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. ప్రస్తుతం ఈ చట్టం తెలంగాణలో అమలులో ఉంది రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు ఆర్టికల్ 48 నిబంధనలు కూడా గోరక్ష కోసం ఏర్పాటు చేసినవే అయినప్పటికీ చట్ట విరుద్ధంగా రాష్ట్రంలో విచ్చలవిడిగా గోవధ



జరుగుతుంది బహిష్టంగా ఉన్న ఎద్దులను కూడా వధిస్తున్నారు ముఖ్యంగా బక్రీదు సందర్భంగా ఈ గోవధ జరుగుతుంది చట్టాన్ని అమలు చేయవలసిన ప్రభుత్వ యంత్రాంగం చేష్టలు అడిగి చూసి చూడనట్లుగా వివరిస్తున్నారు గో ప్రేమికులు గో రక్ష సంస్థలు అనేకసార్లు విజ్ఞప్తి చేసిన పాలకులు పట్టించుకోవడం లేదు కనుక ఇప్పటికైనా గోహత్య నిషేధం చట్టాన్ని కఠినంగా అమలు చేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు కళ్లెం సుధాకర్ రావు, మండల అధ్యక్షుడు కంకణాల రమేష్‌రెడ్డి హుజురాబాద్ టౌన్ సెక్రెటరీ కనకం శ్రీనివాస్, కార్యకర్తలు మధుకర్ రెడ్డి, ప్రవీణ్, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు

# సిఐని కలిసిన కాంగ్రెస్ నాయకులు



**కరీంనగర్ మహా:**

పోలీసుల బదిలీల్లో భాగంగా ఇటీవల తిమ్మాపూర్ సర్కిల్ సీఐ స్వామి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గడ్డం సదన్ కుమార్ తిమ్మాపూర్ సర్కిల్ సిఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మామిడి అనిల్ కుమార్, మండల అధ్యక్షుడు బండారి రమేష్ ఆధ్వర్యంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో.. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పింగిలి కృష్ణా రెడ్డి, బిల్లా సంతోష్, జంగా రామకృష్ణారెడ్డి, వెన్నం సుధాకర్ రెడ్డి , నీలం ఆది రెడ్డి, కర్ర రమేష్ వెన్నం చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు

## భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన
# వీర జవానులకు వందనాలు

19న జరిగే తిరంగా యాత్రను విజయవంతం చేయండి...

బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి...




**కరీంనగర్, మహా:** ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయిన సందర్భంగా వీర జవాన్లకు వందనాలు తెలుపుతూ, భారతదేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన అన్ని రక్షణ వ్యవస్థలను అభినందిస్తూ దేశ వ్యాప్తంగా తిరంగా యాత్రలు నిర్వహించాలని భారతీయ జనతా పార్టీ నిర్ణయించిందని, ఈ మేరకు జిల్లా శాఖ ఆధ్వర్యంలో 19వ తేదీ సోమవారం రోజున కరీంనగర్ లోని తెలంగాణచౌక్ చౌరస్తా నుండి టవర్ సర్కిల్ వరకు తిరంగా ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని, ఇట్టి కార్యక్రమంలో కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ పాల్గొంటారని , ప్రోగ్రాంను విజయవంతం చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు.మే 19 సాయంత్రం 5 గంటలకు తెలంగాణ చౌక్ నుంచి తిరంగా యాత్ర ప్రారంభమవుతుందనీ, బిజెపి శ్రేణులు అందరూ ఈ ప్రోగ్రాం లో పాల్గొని కార్యక్రమాన్ని సక్సెస్ చేయడానికి తగిన కృషి చేయాలన్నారు.మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత భారతదేశం విశ్వగురు స్థాయికి ఎదిగిందని, ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే ధైర్యం భారతదేశానికి ఉందనే విషయం ప్రపంచానికి మొత్తం అర్థమైందన్నారు.ఆపరేషన్ సిందూర్ పేరిట భారత సైన్యం చేపట్టిన చర్యలకు దేశ ప్రజలు పూర్తిస్థాయి మద్దతు తెలిపారని, . 26 నిమిషాల్లో పాకిస్థాన్ లోని ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసిన ఘనత భారత సైన్యానికి దక్కుతుందన్నారు.పాకిస్థాన్ తుప్పు పట్టిన చైనా ఆయుధాలు, పనికిరాని టర్కీ డ్రోన్లతోఅల్లకల్లోలం సృష్టించాలనుకుందనీ, అయితే భారత సైన్యం స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన రక్షణ వ్యవస్థలతో అద్భుతమైన విజయం సాధించిందని తెలిపారు. చివరికి పాకిస్థాన్ అమెరికా ద్వారా శరణు వేడేలా భారత ప్రధానమంత్రి తో బ్రతిమిలాడుకునే స్థాయికి దిగజారిందన్నారు.భారత సైనికులు స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసుకున్న క్షిపణి వ్యవస్థ, ఆయుధాలతో పాకిస్థాన్ కు నిద్రలేని కాలరాత్రులుగడిపేలాచేశారని,రానున్న కాలంలో పాకిస్థాన్ ఎటువంటి కవ్వింపు చర్యలకు, దురాగతాలకు పాల్పడినా తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని భారత ప్రధాని ధీటుగా బదులిచ్చారన్నారు.

ఆపరేషన్ సింధూర్ సందర్భంగా పోరాడి అమరులైన వీర జవాన్లకు, వీరోచిత పోరాటం చేస్తున్న భారత సైనికులకు వందనాలు తెలియజేస్తున్నామన్నారు. జిల్లా , మండల, అసెంబ్లీ కేంద్రాల్లో తిరంగా యాత్ర కార్యక్రమాలు పార్టీ ఆధ్వర్యంలో జరుగుతాయని తెలిపారు. ప్రజలందరూ తిరంగా యాత్రలో పాల్గొని, భారత సైనికులకు వందనాలు తెలియజేయాలని, మోదీ నాయకత్వాన్ని బలోపేతం చేయాలని, ఉగ్రవాద నిర్మూలనకు సంకల్పబద్ధంగా శపథం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

# రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా

రౌడీషీటర్లు పరివర్తన చెందకపోతే పీడీ యాక్ట్ అమలు చేస్తాం

కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్ రెడ్డి

**కరీంనగర్ మహా:**

గతంలో వివిధ రకాల నేరాలకు పాల్పడి పోలీసు రికార్డుల్లో హిస్టరీ షీటర్లుగా కొనసాగుతున్న నేరచరితులు సత్ప్రవర్తనతో మెదలాలని కరీంనగర్ రూరల్ సిఐ ఏ నిరంజన్ రెడ్డి అన్నారు. పరివర్తన చెందకుండా అదే పాత పద్ధతులను అనుసరిస్తూ వివిధ రకాల నేరాల్లో భాగస్వాములు అయినట్లయితే పిడి యాక్ట్ లను కూడా అమలు చేసి సంవత్సరాల తరబడి జైల్లోనే మగ్గే విధంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, రూరల్ ఏసిపి శుభం ప్రకాష్ నగ్రాలా ఆదేశాల మేరకు కరీంనగర్ రూరల్ సర్కిల్ పరిధిలోని రౌడీ షీటర్లకు శుక్రవారం నాడు సిఐ ఏ నిరంజన్ రెడ్డి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్షణికావేశాలకు లోనై అనాలోచిత విధానంతో గతంలో వివిధ రకాల నేరాలకు పాల్పడిన హిస్టరీ షీటర్లు సత్ప్రవర్తనతో మెదిలినట్లయితే వారి పేర్లను పోలీసు రికార్డుల నుండి తొలగిస్తామన్నారు. రౌడీషీటర్లు ఇప్పటికైనా పద్ధతులు మార్చుకుని తమపై ఆధారపడిన కుటుంబాలను పోషించేందుకు జీవనోపాధి కోసం మార్గాలను అన్వేషించాలని తెలిపారు. నేరస్తులు సత్ప్రవర్తన చెందకపోయినట్లయితే వారితో స్నేహం చేసేందుకు ఎవరు కూడా ముందుకు రాకపోవడమే కాకుండా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు వారిని అసహ్యించుకుంటూ బహిష్కృతులను చేస్తారని పేర్కొన్నారు. గతంలో నేరాలకు పాల్పడి గత ఐదు సంవత్సరాల నుండి ఏలాంటి నేరాల్లో భాగస్వాములు కాకుండా ఉండటమే కాకుండా అనారోగ్యం, సత్ప్రవర్తనతో



ఉన్న వారి పేర్లను పోలీసు రికార్డుల నుండి తొలగించేందుకు పరిశీలిస్తున్నామని చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నేరచరితులు మారాలని సూచించారు. పాత నేరస్తులు మారక పోయినట్లయితే వారి ప్రభావం వారి పిల్లలపై పడుతుందనే విషయాన్ని గుర్తించాలని చెప్పారు. హిస్టరీ సీటర్లు మారకపోయినట్లేయితే తమ పిల్లలతో స్నేహం చేసేందుకు తోటి పిల్లలు ముందుకు రాకపోవడమే కాకుండా వివాహాది శుభకార్యాలకు కూడా ఆటంకాలు ఏర్పడే ప్రమాదం ఉందని తెలిపారు. రౌడీ షీటర్ల పై నిరంతరం నిఘా కొనసాగుతోందని చెప్పారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం రేయింబవళ్ళు శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సేవలందించేందుకు పోలీస్ శాఖ సిద్ధంగా ఉందని, ప్రజలు ఇదేవిధంగా తమ వంతు సహకారాన్ని కొనసాగిస్తూ పోలీసుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మారెడ్డి తో పాటుగా 25 మంది హిస్టరీ షీటర్లు పాల్గొన్నారు.

## తాళం పగలగొట్టి ఇంట్లో చోరీ

**వరంగల్ మహా;** వరంగల్ ఎనుమాముల పోలీస్ స్టేషన్ పరిధిలో లక్ష్మీ గణపతి కాలనీకి చెందిన తుప్పరి కరుణాకర్, 43 సం, కూరగాయల వ్యాపారి, గురువారం సాయంత్రం తన ఇంటికి తాళం వేసి తన చెల్లి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం 8 గంటలకు ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటికి వేసిన తాళం ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి తాళం పగులగొట్టి ఇంట్లోకి వెళ్లి బీరువాలో దాచిన రూ 3 లక్షలు నగదు చోరీ చేశారని ఏనుమాముల పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎనుమాముల ఇన్స్పెక్టర్ ఏ రాఘవేందర్ తెలిపారు.



# ప్రజల ఆరోగ్యానికి ప్రధాన శత్రువులు దోమలు

- డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ వి. విజయలక్ష్మి
- షాద్ నగర్ లో ఘనంగా జాతీయ డెంగ్యూ దినోత్సవం

**షాద్ నగర్, మహా:** ప్రజల ఆరోగ్యానికి ప్రధాన శత్రువులు దోమలని అవి పుడితే ఎంతటి వారైనా అనేక వ్యాధులకు గురికాక తప్పదని అందుకే దోమలు కుట్టకుండా, పుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ వి. విజయలక్ష్మి పిలుపునిచ్చారు. జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవ సందర్భంగా షాద్ నగర్ ప్రభుత్వ ఆసుపత్రి నుండి ఫరూక్ నగర్ గాంధీ బొమ్మ చౌరస్తా వరకు నిర్వహించిన ర్యాలీనీ డాక్టర్ వి విజయలక్ష్మి జండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు డెంగ్యూ దినోత్సవ నివారణ నినాదాలను చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. దోమలు పుట్టకుండా చూద్దాం దోమలు కుట్టకుండా చూద్దాం అనే నినాదాన్ని తీసుకువచ్చారు. ప్రతి శుక్రవారం డ్రైడే గా పాటిద్దాం అని కోరారు. అదే విధంగా దోమల వ్యాప్తిని అరికట్టడానికి ప్రజలు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు.. దోమలు ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువులని, దోమల ద్వారా డెంగ్యూ మలేరియా ఫైలేరియా చికెన్ గనియా మెదడువాపు వ్యాధులు వస్తాయని తెలియజేశారు. మన ఇల్లు మరియు పరిసర ప్రాంతాలలో నిల్వ ఉన్న నీటిలో అనా పిలస్ దోమ, క్యూలెక్స్ దోమ, ఏడిస్ దోమ మరియు అజ్మీరస్ దోమలు పెరుగుతాయి అని వివరించారు.

# త్వరగా లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేయండి

బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే

రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పురోగతి పై సమీక్షా సమావేశం

**వరంగల్, మహా;**

రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక త్వరితగతిన పూర్తి చేయాలని బల్దియా కమిషనర్ డా.అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) కార్యాలయం లో రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల పురోగతి పై ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశం లో కమిషనర్ పాల్గొని సమర్థవంతంగా పూర్తి చేయుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించిన అర్హులైన లబ్ధిదారుల దరఖాస్తుల పరిశీలన, ఎంపిక ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని అనంతరం బ్యాంకులకు లోన్ పరిశీలన నిమిత్తం పంపించడం జరుగుతుందని అట్టి పరిశీలన తదుపరి కమిటీ ఆధ్వర్యంలో సెలక్షన్ లిస్ట్ తయారుచేసి అట్టి జాబితాను కలెక్టర్ కు మంజూరు కోసం పంపించడం జరుగు



తుందని ఇట్టి ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి సూచించిన గడువు లోగా పంపాలని అన్నారు. బల్దియా పరిధి 66 డివిజన్ ల నుండి ఎస్సి ఎస్టి బిసి మైనారిటీ కార్పొరేషన్ లకు సంబంధించి 36 వేల దరఖాస్తులు రావడం జరిగిందని, ఇందులో 30 వేల దరఖాస్తు ల పరిశీలన పూర్తి చేయడం జరిగిందని, మిగతా దరఖాస్తుల ను వెంటనే పూర్తి చేయాలని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా నోడల్ అధికారులు ఆలివేలు, రాజేశ్వర్, ఎల్ డి ఏం రాజు, డిప్యూటీ కమిషనర్ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## హిందూ సంఘటిత శక్తిని చాటేలా.....దేశద్రోహుల వెన్నులో వణుకు పుట్టేలా...
# ఇంటింటికీ వెళ్లి యాత్రకు ఆహ్వానించాలని నాయకులను కోరిన సంజయ్

**కరీంనగర్, మహా:** కరీంనగర్ లో ఈనెల 22న నిర్వహించబోయే ''హిందూ ఏక్తా యాత్ర'' తెలంగాణలో ఓ సంచలనం కాబోతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యాఖ్యానించారు. హిందువుల సంఘటిత శక్తి చాటేలా.....దేశద్రోహుల వెన్నులో వణుకు పుట్టేలా.... సంతూష్టీకరణ పేరుతో ఒక వర్గం ఓట్ల కోసం హిందువుల మధ్య విబేధాలు సృష్టిస్తూ ఓటు బ్యాంకు రాజకీయాలు చేసే నాయకుల చెంప చెళ్లుమనేలా ''హిందూ ఏక్తా యాత్ర''ను కనీవినీ ఎరగని రీతిలో నిర్వహిస్తామన్నారు. ''హిందూ ఏక్తా యాత్ర రాజకీయ కార్యక్రమం కానేకాదు. ఇది ఒక పార్టీకి సంబంధించినది కాదు. హిందూ శక్తిని ప్రదర్శించే యాత్ర మాత్రమే. బొట్టు పెట్టుకునే ప్రతి ఒక్కరిదీ''అని అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రతి గ్రామం నుండి మండల కేంద్రాలదాకా, మున్సిపాలిటీ నుండి కార్పొరేషన్ దాకా గడప గడప నుండి హిందువులంతా యాత్రకు తరలిరావాలని పిలుపునిచ్చారు. బీజేపీ నాయకులంతా ఇంటింటికీ



వెళ్లి ఈనెల 22న కరీంనగర్ లో నిర్వహించబోయే 'హిందూ ఏక్తా యాత్ర'కు తరలిరావాలంటూ ఆహ్వానించాలని కోరారు. కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో ఈరోజు సాయంత్రం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని బీజేపీ మండలాల అధ్యక్షులు, ఇంఛార్జీలు, ముఖ్య నాయకులు, మహిళా మోర్చా నాయకులతో 'హిందూ ఏక్తా యాత్ర' సన్నాహక సమావేశం నిర్వహించారు. కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, రెడ్డబోయిన గోపి, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, మాజీ మేయర్ సునీల్ రావు, చెన్నమనేని వికాస్ రావు, గుగ్గిళ్ల రమేశ్, ఓదేలు, వాసాల రమేశ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ ఏమన్నారంటే.... తెలంగాణ ఉద్యమంతో ప్రత్యేక రాష్ట్రం సిద్దించింది. ఇక మళ్లీ తెలంగాణ సెంటిమెంట్ తో రాజకీయాలు నడవవు. ఇప్పుడు జాతీయవాదులను, హిందువులందరినీ ఏకం చేయాల్సిన అవసరం వచ్చింది. పెహెల్ గాం ఘటనతో ఏం జరిగిందో అందరం చూసినం. ప్రతి ఒక్క హిందువు ఆ ఘటనను చూసి రగిలిపోయారు. ఉగ్రవాదులతోపాటు పాకిస్తాన్ అంతు చూడాలని కోరుకున్నారు. ఆ తరువాత ఏం జరిగిందో మీ అందరికీ తెలుసు. ఇప్పుడు హిందువులందరినీ ఏకం చేయాల్సిన అవసరం ఏర్పడింది. హిందూ ఏక్తా యాత్ర ద్వారా హిందువులందరికీ సంఘటితం చేసే మహత్తర అవకాశం వచ్చింది. ఈనెల 22న కరీంనగర్ లో నిర్వహించబోయే 'హిందూ ఏక్తా యాత్ర' ద్వారా ఈ అవకాశం మనందరికీ వచ్చింది. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లండి.

# ఏనాడైనా మహిళలకే ప్రాధాన్యత

## షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**అన్నారంలో ఘనంగా జై భీం, జై బాపు, జై సంవిధాన్ కార్యక్రమం**

**అన్నారంలో ఎమ్మెల్యే కార్యక్రమానికి భారీగా తరలివచ్చిన మహిళలు**

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే శంకర్**

**దేశాన్ని కేంద్ర పాలకుల కుట్రలతో సురక్షితంగా ఉంచుతాం**



**షాద్ నగర,మహా:** ఆనాడైనా ఈనాడైనా ఏనాడైనా కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకే అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని సంక్షేమ పథకాల్లో ముందు వరుసలు మహిళలకే గౌరవం దక్కుతుందని షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గ పరిధిలోని ఫరూక్ నగర్ మండలం అన్నారం గ్రామంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంతో మహిళలు అత్యధికంగా ఆయా గ్రామాల నుండి తరలివచ్చారు. గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసిన ఎమ్మెల్యే శంకర్ తదితర కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అన్నారం గ్రామంలో భారీ ప్రదర్శన ర్యాలీని నిర్వహించారు. రాజ్యాంగానికి సంబంధించిన పుస్తకాలను గ్రామంలో ప్రదర్శించడం విశేషం. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామసభలో రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రసంగిస్తూ..

**మహిళలకే పెద్ద పీట**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మహిళలకు పెద్దపీట వేశామని సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల్లో వారికి ప్రాధాన్యత ఇచ్చామని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. ముఖ్యంగా తెలంగాణ బడ్జెట్ 202526 ప్రవేశపెట్టిన సమయంలో కూడా మహిళలకే తొలి ప్రాధాన్యత ఇచ్చి ఎన్నో నిధులు మంజూరు చేశామని స్పష్టం చేశారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండవ బడ్జెట్ ఈ సంవత్సరం ప్రవేశపెట్టినపుడు మహిళల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకుని వారికి నిధులు కేటాయించడం జరిగిందన్నారు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలపై కీలక కేటాయింపులు చేసారన్నారు. ఇటీవల కేటాయించిన బడ్జెట్ లో

**ప్రభుత్వం ఆరు హామీల అమలు కోసం రూ.56,084 కోట్లు**

ప్రభుత్వం ఆరు హామీల అమలు కోసం రూ.56,084 కోట్లు కేటాయించిందనీ, ఇందులో మహాలక్ష్మి పథకానికి రూ.4,305 కోట్లు, గృహ జ్యోతికి రూ.2,080 కోట్లు, సన్న బియ్యం బోనస్‌కు రూ.1,800 కోట్లు, రాజీవ్ ఆరోగ్య శ్రీకి రూ.1,143 కోట్లు, గ్యాస్ సిలిండర్ సబ్సిడీకి రూ.723 కోట్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు రూ.600 కోట్లతో కీలక కేటాయింపులు చేసారన్నారు.

**తెలంగాణ విజన్**

అయితే రైజింగ్ తెలంగాణ విజన్ కింద ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం నిబద్ధతను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నొక్కిచెప్పారు. ఇంకా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడంపై రాష్ట్రం దృష్టి సారించిందని పునరుద్ఘాటించారు. రైతు సంక్షేమం సహా గ్రామీణాభివృద్ధిని బలోపేతం చేయడం లక్ష్యంగా రైతు భరోసా, ఇందిరమ్మ అభయ హస్తం వంటి వివిధ పథకాలకు మద్దతుగా తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి రూ.24,439 కోట్లు కేటాయించిందనీ తెలంగాణ బడ్జెట్‌లో మహిళలకు అగ్ర ప్రాధాన్యత కొనసాగుతోందనీ మహాలక్ష్మి బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకం ద్వారా ప్రభుత్వం రూ. 5,005 కోట్ల కేటాయించిందనీ, అదనంగా ఉచిత గ్యాస్ పంపిణీ కోసం రూ. 433 కోట్లు కేటాయించారనీ రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉద్యోగ అవకాశాల శాతాన్ని పరిగణనలోకి తీసుకుంటూ ఇందిరమ్మ ఇళ్లను కేటాయించారని కూడా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

**దేశాన్ని రక్షించుదాం..**

బిజెపి కేంద్ర పాలకుల కబంధహస్తాలలో నలిగిపోతున్న దేశాన్ని రక్షించడానికి ప్రజలు ముందుకు రావాలని అన్నారు. కార్పొరేట్ రంగ సంస్థలకు దాసోహమైన మోడీ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసేందుకు కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నారని జై బాబు జై భీమ్ జై సమ్మిదాన్ కార్యక్రమాలతో దేశంలో రాజ్యాంగానికి ఇలాంటి తూట్లు పడకుండా కేంద్ర ప్రభుత్వాన్ని అడ్డుకుంటున్నామని గుర్తు చేశారు. కేంద్రంలో మత జాతి వైరాలను సృష్టిస్తూ రాజ్యాంగ హక్కులను కాలరాసే విధంగా ప్రయత్నిస్తున్నారని దీనిని కాంగ్రెస్ అడ్డుకుంటుందని హెచ్చరించారు. కార్పొరేట్ సంస్థల గులాముగా మారిన కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసేందుకే దేశవ్యాప్తంగా జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని గ్రామీణ స్థాయిలో తీసుకువచ్చావని చెప్పారు.

**ఇందిరమ్మ ఇండ్లకు శంకుస్థాపన..**

అన్నారం గ్రామంలో ప్రభుత్వ మంజూరు చేసిన ఇందిరమ్మ గృహాల నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే వీళ్ళపల్లి శంకర్ శంకుస్థాపన చేశారు. గత ప్రభుత్వం డబల్ బెడ్ రూమ్ ఇళ్లను ఇస్తామని చెప్పి మోసం చేసిందని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తేడా లోపల అందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెప్పి అర్హులకు ఇండ్లు ఇస్తున్నామని అన్నారు. పేద ప్రజలకు ఉండడానికి ఇల్లు ఎంతో ముఖ్యమని ముఖ్యంగా పేదలకు దొడ్డు బియ్యం స్థానంలో సన్న బియ్యం ఇచ్చి వారిని ఎంతో గౌరవిస్తున్నామని అన్నారు. రాబోయే కాలంలో ఇంకా మరెన్నో సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని ప్రజల అండదండలు సహకారం ఎల్లప్పుడూ ఉండాలని ఎమ్మెల్యే శంకర్ కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు నాయకులు కాంగ్రెస్ నాయకులు తదితరులు హాజరయ్యారు..

# బహుజనుల విప్లవ కెరటం కామ్రేడ్ మారోజు వీరన్నకు ఘన నివాళి..!!

**మారోజు వీరన్న వర్ధంతి సభ పాల్గొన్న తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు..**

మారోజు వీరన్న విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తా..

తుంగతుర్తి మండలం కర్విరాల కొత్తగూడెం వద్ద

కామ్రేడ్ మారోజు వీరన్న విగ్రహానికి పుష్పాంజలి ఘటించిన ఎమ్మెల్యే సామేలు...



**తుంగతుర్తి ,మే 16 మహా :** బహుజనుల విప్లవ కెరటం కామ్రేడ్ మారోజు వీరన్న అని ఎమ్మెల్యే సామేలు అన్నారు. బుధవారం మండల పరిధిలోని కర్విరాల వద్ద మారోజు వీరన్న వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ....ఈ సందర్భంగా ఆయన వీరత్వాన్ని కొనియాడుతూ మాట్లాడారు.. కామ్రేడ్ మారోజు వీరన్న 1999 మే 16 సంవత్సరంలో ఆనాటి టీడీపీ చంద్రబాబు ప్రభుత్వం బూటకపు ఎన్ కౌంటర్ చేసి రాజకీయ హత్య చేయడం ఆనాడు జరిగిందని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పిన విధంగా చిన్న రాష్ట్రాల వల్లే అభివృద్ధి ఫలాలు అందరికీ అందుతాయని, బహుజనులకు రాజ్యాధికారం దక్కుతుందని చెప్పిన ఉద్యమ కెరటం మారోజు వీరన్న అన్నారు. వీరన్న కన్న కలలు సాకారం అయినప్పుడే మనమంతా వీరన్నకిచ్చే ఘన నివాళి అని పేర్కొన్నారు. దేశంలో విప్లవం విజయవంతం కావాలంటే కుల, వర్గ జమిలి పోరాటాల ద్వారానే విజయవంతం అవుతుందని చెప్పిన ఒకే ఒక్క వ్యక్తి మారోజు వీరన్న అని కొనియాడారు. వీరన్న విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మారోజు వీరన్న సతీమణి మారోజు చైతన్య, కూతురు మారోజు దిశ, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధ కిషన్ రావు, మార్కెట్ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొంగరి గోవర్ధన్, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.



# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె వాయిదా...!!

**జూలై 9 న సమ్మె ...**
**విలేఖరుల సమావేశంలో మల్లు గౌతమ్ రెడ్డి...**

**మిర్యాలగూడ,మే 16 మహా:**

ఈనెల 20న జరగాల్సిన కార్మిక సంఘాల దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జూలై 9కి వాయిదా వేసినట్లు సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి డాక్టర్ మల్లు గౌతమ్ రెడ్డి తెలిపారు శుక్రవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సార్వత్రిక సమ్మెను అన్ని కార్మిక సంఘాలు వాయిదా వేసినట్టు తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో కూడా కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడులను ముమ్మరంగా అమలు చేస్తుందని విమర్శించారు. 8 గంటల పని విధానాన్ని రద్దుచేసి 12 గంటల పని విధానాన్ని అమలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నదని చెప్పారు. కార్మికుల హక్కులను కాలరాసేందుకు కేంద్ర ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తుందని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగా అమలు అవుతున్న లేబర్ కోడులను రద్దు చేయాలని కోరారు. హమాలీ, ట్రాన్స్పోర్ట్ కార్మికులకు సంక్షేమ బోర్డు అమలు చేయాలన్నారు. దేశంలో ఉన్న క్లిష్ట పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జులై 9 కి సమ్మెను వాయిదా వేశారని తెలిపారు. సమ్మె విషయంపై సంఘటిత అసంఘటిత రంగ కార్మికులలో విస్తృత ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు కోడి రెక్క మల్లయ్య, గుణ గంటి రామచంద్రు, బొచ్చు కోటిరెడ్డి, తెలుకుంట్ల పాపిరెడ్డి భాష తదితరులు పాల్గొన్నారు.

# సేంద్రీయ సాగుతో ఆహార నాణ్యత పెంచాలి...!!

**ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్...**



**మిర్యాలగూడ, మే 16 మహా:** రైతులు పంటలు మార్పిడితో పాటు సేంద్రియ విధానంలో సాగు చేపట్టి ఆహార నాణ్యత పెంచాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం జప్తీ వీరప్ప గూడెం గ్రామంలో ... త్రిపురారం మండల పరిధి కంప సాగర్ వ్యవసాయ శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో 'రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు' పేరిట ప్రత్యేక సమావేశం నిర్వహించి రైతులకు వ్యవసాయ సాగుపై అవగాహన కల్పించారు.. ఈ సందర్భంగా వారు హాజరై మాట్లాడారు. శాస్త్రవేత్తలు ఫుడ్ క్వాలిటీ, అధిక దిగుబడి పెంచేందుకు కృషి చేయాలని కోరారు. ఆహారంలో నాణ్యత పెరిగితేనే భవిష్యత్తు రాలకు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందన్నారు. పెస్టిసైడ్స్ వినియోగం తగ్గించే విధంగా రైతులను సన్నద్ధం చేయాలని అగ్రికల్చర్ ఆఫీసర్లను, శాస్త్రవేత్తలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల అగ్రికల్చర్ ఆఫీసర్ దీరావత్ సైదా నాయక్, కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం సమన్వయకర్త డాక్టర్ ఎస్. శ్రీనివాసరావు, శాస్త్రవేత్తలు డాక్టర్ చంద్రశేఖర్, రాములమ్మ, మత్స్యశాఖ అధికారి కిషోర్, ఆత్మ ఏటీఎం కృష్ణ నాయక్, ఆత్మ చైర్మన్ శ్రీనివాసరావు, విత్తనం, విత్తనో త్పత్తి సంస్థ ఆఫీసర్లు రాంబాబు, నరసింహ, మాజీ ఎంపీపీ ఎస్ కే జిందా, ఆపిదయ రైతులు వంకాయలపాటి చలపతిరావు, శ్రీనివాసరావు ఏఈఓలు షఫీ, రమేష్ ఉన్నారు.



## శుభ్రత, ట్రేడ్ లైసెన్స్ లేని హోటల్స్ కు జరిమానా

**రూ.62 వేల జరిమానాలు విధింపు**

**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ నగరంలో అపరిశుభ్ర పరిస్థితుల్లో, ట్రేడ్ లైసెన్స్ లేకుండా హోటల్స్ నిర్వహణకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయానికి గాను మొత్తం రూ.62 వేలు జరిమానా విధించినట్లు బల్దియా ముఖ్య ఆరోగ్యాధికారి డా.రాజారెడ్డి తెలిపారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం నగర పరిధిలోని పలు హోటళ్లు, రెస్టారెంట్ లు షాపులను శానిటేషన్ అధికారులు తనిఖీలు చేపట్టి అపరిశుభ్ర పరిస్థితుల్లో హోటల్ నడుపుతున్న 51 వ డివిజన్ పరిధిలోని ఎక్సైజ్ కాలనీ లో గల నాటుకోడి చిట్టి గారెలు హోటల్ కు రూ.30 వేలు ట్రేడ్ లైసెన్స్ లేకుండా రెస్టారెంట్ నిర్వహిస్తున్న హంటర్ రోడ్ లోని కడాయి రెస్టారెంట్‌కు రూ. 30 వేలు నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయిస్తున్న వెంకట సాయి కిరాణా షాపు యజమానికి రూ.2 వేలు జరిమానా తో కలిపి మొత్తంగా రూ.62 వేల జరిమానా విధించినట్లు సి ఎం హెచ్ ఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్, సంపత్ రెడ్డి, నిరంజన్, అనిల్, ప్లాస్టిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం, సిబ్బంది పాల్గొన్నారు.



## డెంగ్యూ పై అవగాహన ర్యాలీ

**మేటు పల్లి, మహా:** మెట్ పల్లి మండలం,వెంపేట్ గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలం నందు జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా డెంగ్యూ అవగాహన సమావేశము ఏర్పాటు చేసి డెంగ్యూ ర్యాలీ నిర్వహించినైనది. మరియు మండల వైద్యాధికారి అంజిత్ రెడ్డి అధ్యక్షతన సబ్ యూనిట్ ఆఫీసర్ మీర్జా విలాయత్ బిగ్. మరియు HEO రమేష్ గారు మాట్లాడుతూ సమాజంలో భాగ్యస్యామ మై డెంగ్యూను నివారించాలన్నారు దోమలను నిర్మూలించండి దోమ కాటు నుండి రక్షించండి అని పిలుపునిచ్చారు ప్రతి మంగళవారము శుక్రవారం డ్రైడేగా పాటించి నిల్వ ఉన్న నీటిని తొలగించి ఆరబెట్టి మళ్లీ నీటిని నింపుకోవాలని తెలిపారు ఇళ్లలోని కుండీలలలో నిల్వ ఉన్న నీళ్లను టైర్లలో కూలర్ లలో ఉన్న నీటి ని తొలగించాలన్నారు ఇంటి పక్కన నీరు నిలవకుండా చూడాలని అన్నారు ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అంజిత్ రెడ్డి సబ్ యూనిట్ ఆఫీస్ మీర్జా విలాయత్ బెగ్ డాక్టర్ నాగార్జున మరియు హెచ్ ఈ ఓ రమేష్ గారు సూపర్వైజర్ అచ్యుత్ రావు .సువర్ణ ANM ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు

## యువత ఆత్మహత్యల నివారణపై చైతన్య పరచాలి

జిల్లా మాజీ శిశు సంక్షేమ శాఖ చైర్‌పర్సన్, కేశంపేట మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి

డాక్టర్ కొమ్ము వెంకన్న బాబు కుటుంబాన్ని పరామర్శించిన దంపతులు



**షాద్ నగర, మహా:** షాద్ నగర్ పట్టణానికి చెందిన సామాజిక వేత్త డా. కొమ్ము వెంకన్న బాబు కుటుంబాన్ని పరామర్శించిన రంగారెడ్డి జిల్లా మాజీ శిశు సంక్షేమ శాఖ చైర్‌పర్సన్, కేశంపేట మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి దంపతులు. శుక్రవారం వారిని కలిసి ధైర్యం చెప్పారు. "ఇలాంటి దుర్ఘటనలు తీవ్ర ఆవేదన కలిగించేవే - సమాజంగా మేలుకోవాలి" అని ఆమె ప్రస్తావించారు. ఇటీవల డాక్టర్ కొమ్ము వెంకన్న బాబు కుమారుడు డాక్టర్ మహర్షి ఆత్మహత్య చేసుకున్న విషాదకర ఘటన నేపథ్యంలో, మాజీ జడ్పిటిసి, తెలంగాణ రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ చైర్‌పర్సన్ అయిన తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి వారి కుటుంబాన్ని స్వయంగా పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "ఇలాంటి దుఃఖదాయక ఘటనలు మనసును కలచివేస్తాయి. మనం కలసి సమాజంలో ఆత్మహత్యలపై అవగాహన పెంచాలి. క్షణికావేశంలో తీవ్ర నిర్ణయాలు తీసుకోవడం సరికాదు. ప్రతి ఒక్కరూ ధైర్యంగా పరిస్థితులను ఎదుర్కొనేలా మనం తోడ్పడాలి" అని సూచించారు. డా. వెంకన్న బాబు కుటుంబ సభ్యులను, కీర్తిశేషులు డాక్టర్ మహర్షి సతీమణి డాక్టర్ రజిత ను ఓదార్చిన తాండ్ర విశాల , వారికి అవసరమైన మానసిక బలాన్ని అందించేందుకు ప్రయత్నించారు. ఈ సమయంలో ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడి, వారి బాధను పంచుకున్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తాండ్ర శ్రావణ్ రెడ్డి కూడా డా. వెంకన్న బాబు కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సమాజం చైతన్యవంతంగా స్పందించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు..

## ధాన్యం సేకరణపై మంత్రుల వీడియో కాన్ఫరెన్స్




**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో శుక్రవారం హైదరాబాదు నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో యాసంగి ధాన్యం సేకరణపై రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీ.ఎస్. చౌహాన్ల తో కలిసి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌర సరఫరాల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్ జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల గురించి కలెక్టర్ డాక్టర్ సత్య శారద మంత్రులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ.. జిల్లాలో 182 ధాన్యం కొనుగోలు సెంటర్ల లో 2024 25 రబీ సీజనుకు గాను జిల్లా నుండి రెండు లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం సేకరణ అంచనా వేయగా ఇప్పటివరకు దాదాపు 87 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో అన్ని ఏర్పాట్లు చేశామని, నిత్యం పర్యవేక్షణ చేయడం జరుగుతున్నదని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ సారి రాష్ట్రంలో యాసంగి సీజన్లో రికార్డు స్థాయిలో వరి ధాన్యం సాగు అయ్యిందని అన్నారు. ఈ నేపథ్యంలో ధాన్యం సేకరణను ఓ మహా యజ్ఞంలా భావిస్తూ, రైతుల నుండి ప్రభుత్వం పెద్ద ఎత్తున మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తోందని తెలిపారు. సన్నలకు బోనస్ సైతం చెల్లించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో 60.14 లక్షల ఎకరాల్లో వరి పంట సాగు చేయగా, 129.35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వచ్చాయని వివరించారు. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా 8329 కొనుగోలు కేంద్రాల ద్వారా 70.13 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించుకోవడం జరిగిందన్నారు. ఇప్పటికే తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా 49.53 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలను సేకరించడం జరిగిందన్నారు. గడిచిన మూడు సంవత్సరాలలో పోలిస్తే ఈసారి దాదాపు రెట్టింపు స్థాయిలో ధాన్యం సేకరణ జరుపుతున్నామని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సన్న బియ్యం పంపిణీలో ఎలాంటి అవాంతరాలు లేకుండా పర్యవేక్షణ జరపాలని, నాణ్యమైన బియ్యం పంపిణీ జరిగేలా చూడాలన్నారు. కొత్త రేషన్ కార్డులు, కుటుంబ సభ్యుల పేర్ల నమోదు కోసం వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిశీలిస్తూ మంజూరీలు తెలుపాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బోగస్ కార్డులు జారీ కాకుండా పకడ్బందీ పరిశీలన జరపాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో వరంగల్ జిల్లా నుండి డిసిఓ నీరజ, డిఏఓ అనురాధ, డీఆర్డీఓ కౌసల్య దేవి, డి ఎం సివిల్ సప్లై సంధ్యారాణి, డీఎస్ఓ కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ సర్టిఫికెట్లతో మోసం

## ఆరుగురు అరెస్టు... ఏడుగురు పరారీ

ఆస్తుల క్రయవిక్రయాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు

ఎల్బీనగర్ ఎస్ఐటీ, సరూర్ నగర్ పోలీసుల జాయింట్ ఆపరేషన్ నక్సెన్




**ఎల్బీనగర్, మహా :** నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తూ అక్రమ దందాకు పాల్పడుతున్న ముఠాను రాచకొండ పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో ఆరుగురిని అరెస్టు చేయగా.. మరో ఏడుగురు పరారీలో ఉన్నారు. శుక్రవారం ఎల్బీనగర్ లోని రాచకొండ క్యాంపు కార్యాలయంలో సీపీ సుధీర్ బాబు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నకిలీ సర్టిఫికెట్ల తయారీ ముఠా చేస్తున్న మోసాలను వివరించారు. ఓ మహిళతో మరో ఐదుగురి అరెస్టు, రిమాండ్, పరారిలో మరో ఆరుగురి ముఠానభ్యులు భారీగా నకిలీ స్టాంపు పేపర్లు, నకిలీ సర్టిఫికేట్లు, రబ్బరు స్టాంపులు, కంప్యూటర్ల స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన నకిలీ సర్టిఫికెట్ల తయారీ ముఠా చేస్తున్న మోసాలను వివరించారు.

స్టాంపు పేపర్లతో మోసాలకు పాల్పడినట్లు తెలిసింది. ఈ ముఠా సభ్యులపై ఎల్బీనగర్ ఎస్ఓటీ పోలీస్ బృందానికి కీలక సమాచారం అందింది. ఈ సమాచారాన్ని ఉన్నతాధికారాలతోపాటు రాచకొండ సీపీ సుధీర్ బాబు దృష్టికి తీసుకువెళ్లారు. సీపీ సూచనలతో అత్యంత పకడ్బందీగా ఎల్బీనగర్ ఎస్ఓటీ పోలీస్, సరూర్ నగర్ పోలీస్ బృందం అధికారులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించి ముఠా గుట్టును రట్టు చేశారు. ఈ ముఠాలోని ఓ మహిళతో సహ మరో ఐదుగురిని వలపన్ని పట్టుకున్నారు. వారి నుంచి భారీ ఎత్తున నకిలి స్టాంపు పేపర్లు, సర్టిఫికేట్లు, రబ్బరు స్టాంపులు, కెమికల్స్, కంప్యూటర్లు తదితర సామాగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మరో ఏడుగురు పరారీలో ఉన్నారు.

సులభంగా డబ్బు సంపాధించాలనే దురాలోచనతో ఓ ఇద్దరు భార్యాభర్తలు మోసాలకు ఆలోచనలకు పదునుపెట్టారు. భార్యాభర్తలు నడుపుతున్న టైపింగ్ సెంటర్ ను నకిలీ స్టాంపు పేపర్ల తయారీ కేంద్రంగా మార్చి భారీ దందాకు తెరలేపారు. బయటకు జిరాక్స్, టైపింగ్ సెంటర్ గానే విధులు నిర్వహిస్తూ నకిలీ స్టాంపు పేపర్లను అచ్చువేసి భారీగానే దండుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. సంవత్సరాల తరబడిగా నకిలీ స్టాంపు పేపర్లు, సర్టిఫికెట్ల దందా మూడు పువ్వులు, ఆరు కాయలన్నట్లుగా సాగుతున్నది. నకిలీ దందాలో మరో పదిమందితో కలిసి ముఠాగా ఏర్పడి నకిలీ స్టాంపు పేపర్లు, సర్టిఫికెట్ల దందాను భారీఎత్తున కొనసాగించారు. దాదాపు 30, 35 ఏళ్ళ క్రితం నాటి నకిలీ స్టాంపు పేపర్లను తయారు చేసి ఒక్కొక్కటి దాదాపు 30వేల వరకు విక్రయించి స్థిర, చరాస్తుల క్రయ, విక్రయాల్లో ఈ ముఠాసభ్యులు అందించిన

రంగారెడ్డి జిల్లా హయత్ నగర్ కుంట్లూరు ప్రాంతానికి చెందిన తోట వెంకటభానుప్రకాష్(55) తోట సాగరిక(38) భార్యాభర్తలు. వీరు కొంతకాలంగా సాత్విక ఎంటర్ప్రైజెస్ పేరుతో జిరాక్సు, టైపింగ్ సెంటర్ ను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో భారీగా డబ్బు సంపాధించాలనే దురాలోచనలతో నకిలీ స్టాంపు పేపర్ల తయారీని ప్రారంభించినట్లు వెల్లడించారు. కొన్ని సంవత్సరాలుగా గుట్టుచప్పుడు కాకుండా నకిలీ స్టాంపు పేపర్ల దందా యధేచ్ఛగా కొనసాగించారు. ఈ దందా ఎంతవరకు సాగిందంటే నగరంలోని కొన్ని ప్రాంతాల్లో అడ్డదారుల్లో ఆస్తుల క్రయ, విక్రయాలు, భూముల కబ్జా, భూములకు సంబంధించినటువంటి నకిలీ డాక్యుమెంట్స్ కు తోట వెంకట భాను ప్రకాశ్ అతడి భార్య తోట సాగరిక కేంద్రంగా నకిలీ స్టాంపు పేపరకు జోరుగా విక్రయించినట్లు గుర్తించారు. వీరితోపాటుగా ఈ ముఠాలో నగరంలోని సిటీ సివిల్ కోర్టు ప్రాంతంలో ఉండే హుడాకాలనీ ఆసీఫ్ నగర్ కు చెందిన సయ్యద్ ఫిరోజ్ అలీ(34), హయత్ నగర్ హతిగూడ బొమ్మలగుడి ప్రాంతానికి చెందిన అడ్డగూడురు చంద్రశేఖర్(64) స్టాంపు వెండర్, స్టాంపు పేపర్ల విక్రయేత, అడ్డగూడురు అనిల్ (35)స్టాంపు వెండర్, స్టాంపు పేపర్ల విక్రయేత, హైద్రాబాద్ అంబర్పేట ఆకాష్ నగర్ ప్రాంతానికి చెందిన ఎండీ జలీల్(33) నకిలీ బర్త్ సర్టిఫికెట్ల తయారీదారుడు. పులుసు మల్లేశ్ గౌడ్ వరంగల్ జిల్లా ప్రాంతం. ఇతని స్వస్థలం నల్లగొండ జిల్లా చందుపట్ల గ్రామం, నకిలీ బర్త్ సర్టిఫికేట్ల తయారిదారుడు. కామారెడ్డి మున్సిపాలిటీ కార్యాలయంలో తాత్కాలిక ఉద్యోగ విధులు నిర్వహిస్తున్నటువంటి ప్రవీణ్. రంగారెడ్డి జిల్లా నార్సింగి మున్సిపాలిటీలో తాత్కాలిక విభాగంలో విధులు నిర్వహిస్తున్నటువంటి డి సుధీర్ కుమార్ (27) ఇతడిపై మలక్ పేట పోలీస్ స్టేషన్లో కేసు నమోదై వుంది. రంగారెడ్డి జిల్లా బండ్లగూడ జాగీర్ మున్సిపాలిటీ కార్యాలయంలో తాత్కాలిక ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నటువంటి ముదస్సీర్. సరూర్ నగర్ మండలం బృందావన్ కాలనీకి చెందిన జల్లా కిశోర్ కుమార్ (44) బొటిక్ వ్యాపారి. నకిలీ స్టాంపు పేపర్ల విక్రయేత. ఇతని స్వస్థలం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామం. వీరితోపాటుగా చంచల నిఖిల్ స్వస్థలం ఖమ్మం పట్టణం. నకిలీ పత్రాలతో బ్యాంకు లోన్లు ఇప్పించడం వృత్తిగా కొనసాగిస్తున్నాడు. దిల్ సుఖ్ నగర్ ప్రాంతానికి చెందిన నకిలీ రబ్బర్ స్టాంపు తయారీదారుడు సత్యప్రభుతో సహ మొత్తం 12మంది ముఠా సభ్యులుగా ఏర్పడినట్లు తెలిపారు. వీరు తయారు చేసి విక్రయించినటువంటి నకిలీ స్టాంపు పేపర్లు, సర్టిఫికెట్లతో భారీ ఎత్తున మోసాలు జరిగినట్లు గుర్తించారు. ఈ ముఠాపై ప్రత్యేక నిఘాతో ఎల్బీనగర్ ఎస్వోటీ, సరూర్ నగర్ పోలీసులు ప్రత్యేక నిఘాతో ముఠాలోని తోట సాగరిక, తోట వెంకటభానుప్రకాష్, అడ్డగూడురు చంద్రశేఖర్, అడ్డగూడురు అనిల్, ఎండీ జలీల్, జల్లా కిశోర్ కుమార్ ను అదుపులోకి తీసుకున్నట్లు సీపీ సుధీర్ బాబు తెలిపారు. పరారీలో ఉన్న మరో ఏడుగురు కోసం ప్రత్యేక గాలింపు చర్యలు చేస్తున్నట్లు, కేసు దర్యాప్తును పకడ్బందీగా విచారణ చేస్తునచనట్లు తెలిపారు. ఈ ముఠా సభ్యులు విక్రయించిన నకిలీ స్టాంపు పేపర్లు, నకిలీ సర్టిఫికెట్లతో ఏఏ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారో దర్యాప్తులో తెలుస్తుందన్నారు. వీరి వద్దనుండి నకిలీ స్టాంపు పేపర్లతోపాటు సర్టిఫికేట్లు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నామన్నారు. వీరిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి రిమాండ్ కు తరలిస్తున్నట్లు సీపీ సుధీర్ బాబు పేర్కొన్నారు. ఈ కేసును ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని దర్యాప్తు చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో ఎస్ఓటీ ఏ డిసిపి మహ్మద్ షకీర్ హుస్సేన్, ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, ఎస్ఓటీ సీఐ ఏ వెంకటయ్య, సరూర్ నగర్ సీఐ సైదిరెడ్డి, ఎస్సై లక్ష్మణ్, ఎల్.బి.నగర్, మహేశ్వరం ఎస్ఓటీ పోలీసు బృందాలు, సరూర్ నగర్ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సౌత్ ఇండియన్ బ్యాంక్‌కు లాభాలు.. షేర్లకు డివిడెండ్





**న్యూఢిల్లీ:** ప్రయివేట్ రంగ సంస్థ సౌత్ ఇండియన్ బ్యాంక్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి (క్యూ4)లో నికర లాభం 19 శాతం వృద్ధితో రూ. 342కోట్లను తాకింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 288 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 2,621 కోట్ల నుంచి రూ. 2,946 కోట్లకు ఎగసింది. వాటాదారులకు బ్యాంక్ బోర్డు షేరుకి రూ. 0.4 డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి బ్యాంక్ నికర లాభం 22 శాతం జంప్‌చేసి రూ. 1,303 కోట్లను తాకింది. 2023-24లో రూ. 1,070 కోట్లు మాత్రమే ఆర్జించింది. ఫలితాల నేపథ్యంలో బ్యాంక్ షేరు బీఎస్ఈలో 4 శాతం ఎగసి రూ. 28 వద్ద ముగిసింది.

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

భారతీయ బెంచ్‌మార్క్ ఈక్విటీ సూచీలు బీఎస్ఈ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 సూచీలు ఈ వారం చివరి ట్రేడింగ్ సెషన్‌ను నష్టాలతో ముగించాయి. ఇన్వెస్టర్లు అధిక స్థాయిలో లాభాల నమోదుకు పరుగులు తీయడంతో సూచీలకు నష్టాలు తప్పలేదు. శుక్రవారం బీఎస్ఈ సెన్సెక్స్ 200.15 పాయింట్లు లేదా 0.24 శాతం క్షీణించి 82,330.59 వద్ద ముగిసింది. ఈ సూచీ ఈరోజు 82,514.81 నుంచి 82,146.95 మధ్య ట్రేడ్ అయింది. అలాగే నిఫ్టీ కూడా 42.30 పాయింట్లు లేదా 0.17 శాతం క్షీణించి 25,019.80 వద్ద స్థిరపడింది. విస్తృత మార్కెట్లు బెంచ్‌మార్క్‌లను అధిగమించాయి. స్మాల్ క్యాప్ షేర్లు లాభాల్లో ముగిశాయి. నిఫ్టీ స్మాల్ క్యాప్ 100, నిఫ్టీ మిడ్ క్యాప్ 100 సూచీలు వరుసగా 1.86 శాతం, 0.94 శాతం లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ షేర్లలో హిందుస్థాన్ యూనిలీవర్, ఏషియన్ పెయింట్స్, ఐటీసీ, ఇండస్ ఇండ్ బ్యాంక్ షేర్లు 1.20 శాతం నుంచి 0.60 శాతం మధ్య లాభపడ్డాయి. అదేసమయంలో భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌సీఎల్ టెక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా షేర్లు 2.76 శాతం నుంచి 0.79 శాతం మధ్య నష్టపోయాయి.



## కేటీఎం బైక్‌లు ఇక మరింత కాస్ట్‌లీ..
## ఏ బైక్ ఎంత పెరిగిందంటే..




ప్రముఖ ప్రీమియం బైక్‌ల తయారీ సంస్థ కేటీఎం ఇండియన్ మార్కెట్లో విక్రయించే తమ ద్విచక్ర వాహనాల ధరలను సవరించింది. ఈ మార్పులతో వివిధ బైక్‌ల ధర రూ.12,000 వరకు పెరిగింది. ఆయా మోడళ్లపై కనీసం రూ.1,000 మేర ధరలను కంపెనీ పెంచేసింది. పెరుగుతున్న ఇన్‌పుట్ ఖర్చులతోపాటు ద్రవ్యోల్బణ వ్యత్యాసానికి అనుగుణంగా సర్దుబాటు చేయడంలో భాగంగా ఇతర కంపెనీలతోపాటు కేటీఎం కూడా తమ బైక్‌ల ధరలను పెంచింది.

**ఏ బైక్‌పై ఎంత పెరిగింది?**

- కేటీఎం 390 డ్యూక్‌పై అత్యల్పంగా రూ .1,000 పెరిగింది. దీంతో ఈ బైక్ ధర రూ.2.96 లక్షలకు (ఎక్స్ షోరూమ్) చేరింది. అయితే ఇంతకుముందు ఈ బైక్ ధరను రూ.18,000 తగ్గించింది. దాంతో అప్పుడు ఈ ద్విచక్ర వాహనం ధర రూ.3.13 లక్షల నుంచి రూ.2.95 లక్షలకు (ఎక్స్ షోరూమ్) తగ్గింది.
- ఇక కేటీఎం 250 డ్యూక్, ఆర్‌సీ 390 మోడళ్ల ధరలు రూ .5,000 కంటే ఎక్కువ పెరిగాయి. దీంతో 250 డ్యూక్ ధర రూ.2.30 లక్షలకు చేరగా, ఆర్‌సీ 390 ధర రూ.3.23 లక్షలకు (రెండూ ఎక్స్‌షోరూమ్ ధరలు) చేరింది. ఇండియన్ మార్కెట్లో బజాజ్ పల్సర్ ఎన్ 250, హీరో ఎక్స్‌ట్రీమ్ 250ఆర్, సుజుకి జిక్సర్ 250 వంటి ప్రసిద్ధ మోడళ్లలో కేటీఎం 250 డ్యూక్ కూడా ఒకటి.
- కేటీఎం ఆర్‌సీ 200 బైక్ ధర అత్యధికంగా రూ .12,000 పెరిగింది. ఈ మార్పుతో, ఈ బైక్ ప్రారంభ ధర రూ .2.21 లక్షల నుండి రూ .2.33 లక్షలకు (ఎక్స్‌షోరూమ్) చేరింది. ఈ బైక్ హీరో కరిజ్మా ఎక్స్‌ఎంఆర్, బజాజ్ పల్సర్ ఆర్ఎస్ 200, సుజుకి ఎస్ఎఫ్ 250, యమహా ఆర్ 15 వీ4 వంటి మోడళ్లకు పోటీగా ఉంది.

## ఆఫీస్‌కు రండి.. సీఈవో ఆర్డర్..
## ఉద్యోగులు ఏం చేశారో తెలుసా?




రిమోట్ వర్క్.. అదేనండి వర్క్ ఫ్రమ్ హోమ్. చాలా మంది ఉద్యోగులకు ఆకర్షణీయమైన ఎంపికగా మారింది. ఓపక్క కుటుంబ బాధ్యతలు చూసుకుంటూనే మరో వైపు ఉద్యోగాన్ని చూసుకుంటున్న వారికి ఈ విధానం చాలా అనువుగా ఉంటోంది. అయితే కోవిడ్19 మహమ్మారి విజృంభణ సందర్భంగా అమలులోకి వచ్చిన ఈ రిమోట్ వర్క్ విధానం నెమ్మదిగా తొలగిపోతోంది. చాలా కంపెనీలు ఉద్యోగులను తిరిగి ఆఫీసులకు పిలుస్తున్నాయి.సౌకర్యవంతమైన ఈ వర్క్ ఫ్రమ్ హోమ్ విధానానికి అలవాటు పడినవారు ఆఫీసులకు తిరిగివెళ్లడానికి ఇష్టపడటం లేదు. చాలా కంపెనీలు ఉద్యోగులను బలవంతంగానైనా ఆఫీసులకు రప్పిస్తున్నాయి. ఇలాగే ఉద్యోగులను ఆఫీసులకు రావాలని ఆదేశించడం ఓ ప్రముఖ ఫుడ్ డెలివరీ కంపెనీలో ఎలా బెడిసికొట్టిందో.. ఉద్యోగులు ఏం చేశారో చెబుతూ ఆ కంపెనీలో పనిచేసే వ్యక్తి రెడ్డిట్ లో షేర్ చేసిన స్టోరీ ఆసక్తికరంగా మారింది.

**ఆఫీస్‌కు రాకపోతే ఏం చేస్తారు?**

కోవిడ్ సమయంలో వర్క్ ఫ్రమ్ హోమ్ అమలు చేసిన కంపెనీ.. ఆ సమయంలో చాలా మందిని రిమోట్ వర్క్ విధానంలోనే నియమించుకుంది. కానీ తర్వాత పరిస్థితులు మారిపోయాయి. అందరూ క్రమంగా ఆఫీసులకు రావాలని యాజమాన్యం ఆదేశించింది. అసలు సమస్య ఏంటంటే.. దాదాపు చాలా మంది రిమోట్ వర్క్ విధానంలోనే ఉద్యోగాల్లో చేరారు. కొంత మంది తమ ప్రాంతాలకు మకాం మార్చారు. ఇప్పుడు వీళ్లకు ఎటువంటి ఆర్థిక సహకారం అందించకుండా ఏడాదిలోగా ఆఫీసులకు వచ్చేయాలని కంపెనీ చెబుతోంది. దీంతో ఉద్యోగులు గందరగోళంలో పడిపోయారు. ఈక్రమంలో కంపెనీ వైడ్ టౌన్ హాల్ సమావేశంలో ఆఫీస్‌కు రావడానికి అయిష్టంగా ఉన్నవారికి మినహాయింపులేమైనా ఉంటాయా అని ఓ ఉద్యోగి నేరుగా సీఈవోనే అడిగేశారు. దానికి సీఈవో స్పందిస్తూ "మీరు ఇంటి నుండి పని చేయాలనుకుంటే, వేరే చోట ఉద్యోగం చూసుకోండి" అంటూ బదులిచ్చారు. దీంతో అవాక్కైన ఉద్యోగులు ఆన్‌లైన్ కాల్స్‌లోకి రావడం మానేశారు. చాలా మంది వెంటనే రాజీనామా చేశారు. ఎక్కువ మంది వెళ్లిపోవడంతో కంపెనీకి షాక్ తగిలింది. క్యూసీ ఉద్యోగులతోనే యాప్ డెవలప్‌మెంట్ చేయించాల్సి వచ్చింది.

### ఈ దేశాలు బంగారానికి
## పుట్టిళ్లు..!!

ప్రపంచవ్యాప్తంగా అత్యంత ఖరీదైన లోహాల్లో బంగారం ఒకటి. బంగారాన్ని వేలాది సంవత్సరాలుగా ఐశ్వర్యానికి, హోదాకు ప్రతిరూపంగా పరిగణిస్తూ వస్తున్నారు. బంగారం మంచి విద్యుత్ వాహకం. దీని ఉపయోగాలు ఎలా ఉన్నా మృదువైన, అరుదైన, సులభంగా ఆకృతులు చేసేందుకు అనువైన ఈ లోహాన్ని ముఖ్యంగా ఆభరణాలలో ఎక్కువగా వినియోగిస్తున్నారు. డిమాండ్ కారణంగా బంగారం విలువ అంతకంతకూ పెరుగుతూ అత్యంత ఖరీదైన లోహంగా మారింది. అందుకే దీన్ని పెట్టుబడి సాధనంగా కూడా భావిస్తారు. శతాబ్దాలుగా మాంద్యం సమయంలో మంచి పెట్టుబడి మార్గంగా బంగారం కొనసాగుతోంది. ఘనాను బంగారు భూమి అంటారు. ఈ ప్రదేశం పశ్చిమ ఆఫ్రికాలో ఉంది. వైవిధ్యమైన బంగారు వనరులు, అభివృద్ధి చెందుతున్న వాణిజ్యం కారణంగా అరబ్ వ్యాపారులు ఘనాకు ఆ పేరు పెట్టారు. బంగారం ఈ ప్రాంత అత్యంత ముఖ్యమైన వస్తువుగా మారింది. అంతేకాకుండా జపాన్ లోని సాడో ద్వీపాన్ని కూడా ఎడో కాలంలో బంగారు భూమిగా పిలిచేవాళ్లు. ఎందుకంటే ఈ ప్రదేశం ఆ సమయంలో జపాన్ మొత్తం బంగారు ఉత్పత్తిలో దాదాపు సగం ఉత్పత్తి చేసేది. అపారమైన సంపదకు, బంగారానికి నిలయంగా ఉండే ఇండోనేషియాలోని ఒకప్పటి శ్రీవిజయ నగరాన్ని కూడా బంగారు ద్వీపంగా పరిగణించేశాళ్లు.




# దేశం-విదేశం

NATIONAL-INTERNATIONAL



## చైనాలో భూకంపం



**బీజింగ్:** చైనాలో భూకంపం సంభవించింది. శుక్రవారం ఉదయం రిక్టర్ స్కేలుపై 4.5 తీవ్రతతో భూకంపం సంభవించినట్టు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ (NCS) వెల్లడించింది. భారత కాలమానం ప్రకారం ఉదయం 6:29 గంటలకు ఈ ప్రకంపనలు సంభవించాయి. భూమి లోతులో 10 కిలోమీటర్ల లోపల భూకంపం నమోదైనట్లు ఎన్‌సీఎస్ అధికారులు తెలిపారు. ఈ మేరకు భూకంప వివరాలను ఎన్‌సీఎస్ తమ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసింది. ఈనెల మే 12న తెల్లవారుజామున 2:41 గంటలకు టిబెట్, చైనా పలు ప్రాంతాల్లో 5.6 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఆ భూకంపం భూమిలో 9 కిలోమీటర్ల లోతులో నమోదైంది.

## కళ్లకు గంతలు కట్టారు.. దూషించారు..

### ఉన్నతాధికారుల వివరాలడిగారు.. బీఎస్ఎఫ్ జవాన్‌ను వేధించిన పాక్ అధికారులు

న్యూఢిల్లీ: అనుకోకుండా సరిహద్దు దాటి పాక్ రేంజర్ల చేతికి చిక్కిన బీఎస్ఎఫ్ జవాన్ పూర్ణం కుమార్ షాను భారత్‌కు అప్పగించిన విషయం తెలిసిందే. విడుదల అనంతరం పాకిస్తాన్ కస్టడీలో ఉన్న 21 రోజుల అనుభవాలను బీఎస్ఎఫ్ అధికారులతో షా పంచుకున్నారు. షా నిర్బంధంలో ఉన్నంత కాలం, పాకిస్తాన్‌లోని మూడు గుర్తుతెలియని ప్రదేశాలకు తీసుకెళ్లారు. ఆ ప్రదేశాల్లో ఒకటి ఎయిర్‌బేస్ సమీపంలో ఉంది. కళ్లకు గంతలు కట్టి ఉంచడంతో.. విమాన శబ్దాలను బట్టి అది ఎయిర్‌బేస్‌గా షా గుర్తించారు. ఇక మరో ప్రదేశంలో జైలు గదిలో కొన్నిరోజులు ఉంచారు. కస్టడీలో ఉన్నన్ని రోజులు కళ్లకు గంతలు కట్టారు. నిద్రలేకుండా చేశారు. దూషించారు. కనీసం పళ్లు తోముకోవడానికి కూడా అనుమతించలేదు. శారీరకంగా హింసించకపోయినా.. సరిహద్దు వెంబడి బీఎస్ఎఫ్ భద్రతాదళాల గురించి ప్రశ్నించారు. అంతర్జాతీయ సరిహద్దులో ఉన్న సీనియర్ అధికారుల వివరాలు చెప్పాలంటూ ఆయనపై ఒత్తిడి తెచ్చారు. అయినా షా వేటికీ సమాధానం ఇవ్వలేదు. బీఎస్ఎఫ్ ప్రోటోకాల్ ప్రకారం.. విధుల్లో ఉండగా సెల్‌ఫోన్ వినియోగం నిషేధం. అందుకే షా పట్టుబడిన సమయంలో అతని దగ్గర మొబైల్ ఫోన్ లేదు. దీంతో వివరాలేవీ పాకిస్తాన్ అధికారులకు దొరకలేదు. పాక్ కస్టడీ నుంచి వచ్చిన షాపై బీఎస్ఎఫ్ అధికారులు విచారణ, వైద్య పరీక్షలు పూర్తి చేశారు. ప్రోటోకాల్ ప్రకారం, పాకిస్తాన్ కస్టడీలో ఉండగా ఆయన ధరించి ఉన్న దుస్తులను తనిఖీ చేసి, పారవేశారు. ఆయన శారీరకంగా, మానసికంగా స్థిరంగా ఉన్నారని సమాచారం. ఏప్రిల్ 23న విశ్రాంతికోసం ఓ చెట్టునీడకు చేరిన షా.. అనుకోకుండా సరిహద్దు దాటాడు.



## పార్లమెంట్‌లో ప్రసంగం..

### నవ్వుల పాలైన పాక్ ఉప ప్రధాని ఇషాక్ దార్



**ఇస్లామాబాద్:** పాక్ ఉప ప్రధాని ఇషాక్‌దార్ మరోసారి నవ్వుల పాలయ్యారు. ఫేక్ వార్తను పార్లమెంట్‌లో చదివి వినిపించి గొప్పలు చెప్పుకున్నారు. పాక్ ఎయిర్‌ఫోర్స్‌ను విదేశీ మీడియా ప్రశంసించిందంటూ ప్రకటించుకున్నారు. అయితే విదేశీ మీడియా తమ ఎయిర్‌ఫోర్స్ గురించి నిజంగా ప్రశంసలు కురిపించిందా? అని పాకిస్తాన్ మీడియా సంస్థ 'డాన్' నిజనిర్ధారణ చేసింది. అందులో విదేశీ మీడియా కథనం బూటకమని తేల్చి చెప్పింది. అసలు ఇషాక్ దార్ చెప్పినట్లుగా సదరు మీడియా సంస్థ సైన్యానికి సంబంధించిన ఎలాంటి వార్తల్ని ప్రచురించలేదని తెలిపింది.

**ఇంతకీ ఏం జరిగిందంటే?**

పాకిస్తాన్‌పై భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను కీర్తిస్తూ అంతర్జాతీయ మీడియా సంస్థలు పలు కథనాల్ని ప్రచురించాయి. ఈ క్రమంలో బ్రిటన్‌కు చెందిన డైలీ టెలిగ్రాఫ్ అందుకు భిన్నంగా 'ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్ ఎయిర్‌ఫోర్స్ వ్యవహరించిన తీరును ప్రశంసంపై ఓ కథనాన్ని ప్రచురించింది' అంటూ డైలీ టెలిగ్రాఫ్ హెడ్‌లైన్‌ను పార్లమెంట్‌లో ఇషాక్ దార్ ప్రస్తావించారు. అసలు విషయం ఏంటంటే?

**'గగనతల రారాజు పాక్ ఎయిర్‌ఫోర్స్'**

వాస్తవానికి డైలీ టెలిగ్రాఫ్ ఆ హెడ్‌లైన్‌ను రాయలేదు. పాకిస్తానీయులే ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో తప్పుడు వార్తను సృష్టించారు. దాన్నే నిజమనుకుని ఇషాక్‌దార్ భ్రమపడ్డారు. 'గగనతల రారాజు పాక్ ఎయిర్‌ఫోర్స్' అంటూ విదేశీ మీడియా కీర్తించిందని ప్రకటన చేశారు. దీంతో కంగుతిన్న డైలీ టెలిగ్రాఫ్ .. అసలు తాము అలాంటి హెడ్‌లైన్ పెట్టలేదని స్పష్టం చేసింది. డైలీ టెలిగ్రాఫ్ మాత్రమే కాదు.. పాక్ దేశ మీడియా సంస్థ డాన్‌న్యూస్ సైతం ఇదే విషయాన్ని చెప్పింది. పాకిస్తాన్ పార్లమెంట్ సమావేశంలో ఆయన చేసిన వ్యాఖ్యల్ని ఖండించింది.

**ఇషాక్ దార్‌వి పచ్చి అబద్ధాలు**

'పాకిస్తాన్ ఎయిర్ ఫోర్స్ ఆకాశాలలో తిరుగులేని రాజు' అని పేర్కొంటూ డైలీ టెలిగ్రాఫ్ వార్త రాసిందా? లేదా? అని డాన్ మీడియా ప్రతినిధులు పరిశీలించారు. ఇషాక్ దార్ చెప్పినట్లుగా సోషల్ మీడియాలో ప్రసారం అవుతున్నట్లుగా మే 10న ది డైలీ టెలిగ్రాఫ్ ఫ్రంట్ పేజీలో ఉన్న వార్తకి.. ఇషాక్ దార్ చదివి వినిపించిన హెడ్‌లైన్‌కు పొంతన లేదని తేలింది. ఆ పత్రిక ఎప్పుడూ అలాంటి కథనాల్ని ప్రచురించలేదని డాన్ తేల్చింది. దీంతో పాక్ ఉప ప్రధాని ఇషాక్ దార్‌పై నెటిజన్లు చూసికోవాలని కదాయ్యా అంటూ కామెంట్లు చేస్తున్నారు.

## ట్రైలర్ మాత్రమే చూశారు..

### పాక్ తీరు మారకపోతే పూర్తి సినిమా చూపిస్తాం



గాంధీనగర్: ఆపరేషన్ సిందూర్ ముగియలేదు. ట్రైలర్ మాత్రమే చూశారు. పాక్ తీరు మార్చుకోకపోతే సినిమా చూపిస్తాం' అంటూ కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ (rajnath singh) హెచ్చరికలు జారీ చేశారు. శుక్రవారం గుజరాత్‌లోని భుజ్ ఎయిర్ బేస్‌లో ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న ఎయిర్ వారియర్స్‌తో రాజ్‌నాథ్ భేటీ అయ్యారు. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న ఎయిర్ వారియర్స్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. అనంతరం, ఆయన మీడియా మాట్లాడారు. పాకిస్తాన్‌పై భారత్ విజయానికి ఎయిర్‌బేస్ సాక్ష్యం.పహల్గాం దాడి, ఆ తర్వాత ఆపరేషన్ సిందూర్‌ను ప్రపంచమంతా చూసింది. పాకిస్తాన్‌లో ఉగ్రశిబిరాలను ధ్వంసం చేశాం. బ్రహ్మోస్ మిస్సైల్ పవరేంటో పాకిస్తాన్‌కు చూపించాం. బోర్డర్ దాటకుండానే పాక్ ఉగ్ర శిబిరాలను నాశనం చేశాం. పాకిస్తాన్ ముఖ్య ఉగ్ర కేంద్రాన్ని ధ్వంసం చేశాం. నయా భారత్ ఎంటో ప్రపంచానికి తెలిసింది. మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది మసూద్ అజహర్‌కు పాక్ రూ.14కోట్లు ఇచ్చింది. ప్రపంచానికి మన సత్తా ఏంటో కళ్లకు కట్టేలా చూపించాం. మన వాయిసేన అసమాన ప్రతిభ కనబర్చి ప్రత్యర్థులను వణికించింది. ఉగ్రవాదులకు పాకిస్తాన్ ఫండింగ్ చేస్తోంది. ఇది ఒక ట్రైలర్ మాత్రమే.. పాక్‌కు అసలు సినిమా ముందుంది' అంటూ రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు.

## 70 ఏళ్ల వ్యక్తి కాలినడకతో కేదార్‌నాథ్‌కు..!



మనిషి సంకల్పం ముందు ఏదైనా చిన్నబోవాల్సిందే. అలాంటి ఉదంతాలు ఎన్నో కోకొల్లలుగా జరిగాయి. వాటన్నింటిని తలదన్నేలా అంతకు మించి..అనే అజేయమైన సాహసానికి తెరతీశాడు ఈ 70 ఏళ్ల వృద్ధుడు. అతడి చేసిన ఘనకార్యం ఏంటో తెలిస్తే.. ఇదేలా సాధ్యం అనే ఆశ్చర్యం కలగకమానదు. కర్ణాటకలోని కలబురగి (గుల్బర్గా) జిల్లాకు చెందిన 70 ఏళ్ల వృద్ధుడు ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ ధామ్‌కు కాలినడకన వచ్చాడు. ఎన్నో వేల కిలోమీటర్లు నడిచి మరీ కేదార్‌నాథ్ స్వామిని దర్శించుకున్నారాయన. ఆ వృద్ధ భక్తుడు తన తోటి యాత్రికుల బృందంతో కలబురగి నుంచి ఈ యాత్ర చేసినట్లు తెలిపారు. తాము మార్చి 3న యాత్రని ప్రారంభించి మే 1న కేదార్‌నాథ్ పుణ్యక్షేత్రానికి చేరుకున్నామని అన్నారు. అంటే దాదాపు రెండు నెలల్లో వివిధ మైదానాలు, అడవులు, పర్వత మార్గాల గుండా సుమారు 2,200 కిలోమీటర్ల అసాధారణ యాత్రను చేశారు వారంతా. అంతేగాదు ఆ వృద్ధుడు ఇదంతా మన ఆధ్యాత్మికతకు ఉన్న శక్తి అని అంటున్నారాయన. దైవం ఆశీస్సులు ఉంటే ఎంత కఠినతరమైన ప్రయాణమైనే చిటికెలో సాధ్యమైపోతుందని ధీమాగా చెబుతున్నాడు ఆ వృద్ధుడు. అందుకు సంబంధించిన వీడియో నెట్టింట తెగ వైరల్ అవుతోంది. ఈ వీడియో ఎంతో మంది నెటిజన్ల మనసును కదిలించింది. ధృడ సంకల్పం, అజేయమైన భక్తి..అనితరసాధ్యమైన ఓర్పుని అందిస్తాయనడానికి ఆ వృద్ధుడే ఉదహారణ అని ప్రశంసిస్తూ పోస్టులు పెట్టారు.




# మహా పత్రిక





## మహేశ్ బాబు- రాజమౌళి సినిమాలో మరో పాన్ ఇండియా హీరో!



సూపర్‌స్టార్ మహేశ్‌బాబు దర్శకుడు రాజమౌళి కలయికలో మొదలైన సినిమా ఇప్పటికే షూటింగ్ ప్రారంభమైంది. భారీ బడ్జెట్‌తో కె.ఎల్. నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అయితే, తాజాగా కోలీవుడ్ నుంచి స్టార్ యాక్టర్ కూడా ఇందులో భాగం కానున్నారని తెలుస్తోంది. త్వరలోనే ఆయన సెట్స్ పైకి కూడా వస్తాడనేది నెట్టింట వైరల్ అవుతుంది

‘ఎస్ఎస్ఎంబీ29’ వర్కింగ్ టైటిల్‌తో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్ లోకి తమిళ స్టార్ హీరో విక్రమ్ జాయిన్ కాబోతున్నాడని సమాచారం. ఈమేరకు ఆయనతో ఇప్పటికే చర్చలు కూడా పూర్తి అయ్యాయట. గతంలో కూడా పృథ్వీరాజ్ సుకుమారన్ ఎంట్రీ గురించి మొదట రూమర్స్‌తోనే ప్రారంభమయిన విషయం తెలిసిందే. కొంతకాలానికి అదే నిజమైంది. ఇప్పుడు విక్రమ్ విషయంలో కూడా ఇదే జరగబోతుందని ఇండస్ట్రీలో టాక్ మొదలైంది. మే నుంచి జూన్ వరకు ఈ సినిమా షూటింగ్ మళ్లీ ప్రారంభం కానుంది. దీనికోసం హైదరాబాద్‌లో ఓ భారీ సెట్‌ను సిద్ధం చేస్తున్నారని సమాచారం. ప్రముఖ హాలీవుడ్ స్టంట్ డైరెక్టర్స్ నేతృత్వంలో బిగ్ యాక్షన్ ఎపిసోడ్‌ను తెరకెక్కించనున్నారని తెలిసింది. ఈ సీన్ నుంచే విక్రమ్ ఎంట్రీ ఉంటుందని అభిమానులు అంచనా వేస్తున్నారు.

‘ఎస్ఎస్ఎంబీ29’లో విక్రమ్ నటించబోతున్నట్లు గతేడాదిలోనే ఈ రూమర్స్ వచ్చాయి. అప్పుడు స్వయంగా విక్రమ్ ఇలా స్పందించాడు. 'రాజమౌళి, నేను రెగ్యూలర్‌గానే టచ్‌లో ఉంటాం. రాజమౌళి దర్శకత్వంలో నా సినిమా తప్పకుండా ఉంటుంది. కానీ, మహేష్ మూవీ గురించి మా మధ్య ప్రస్తుతానికి చర్చలు జరగలేదు' అని ఆయన తెలిపారు. గతంలో పృథ్వీరాజ్ సుకుమారన్ కూడా తనపై రూమర్స్ వచ్చినప్పుడు ఇలానే రియాక్ట్ అయ్యాడు. కొంత కాలానికి మహేష్ సినిమాలో తాను భాగం కాబోతున్నట్లు ప్రకటించారు. కాబట్టి విక్రమ్ విషయంలో కూడా ఇదే జరుగుతుందని ఫ్యాన్స్ భావిస్తున్నారు.




## రామాయణ్‌లో కాజల్ అగర్వాల్.. అలాంటి పాత్రలోనా?

రామాయణం ఆధారంగా మన దేశంలో చాలా సినిమాలు ఇదివరకే తీశారు. తీస్తూనే ఉన్నారు. కొన్నాళ్ల క్రితం ప్రభాస్ 'ఆదిపురుష్' ఇలానే తీశారు. కానీ గ్రాఫిక్స్, పాత్రల తీరుతెన్నులు దారుణంగా ఉండేసరికి విపరీతమైన విమర్శలు వచ్చాయి. కట్ చేస్తే ఇప్పుడు 'రామాయణ్' పేరుతో హిందీలో మళ్లీ సినిమా తీస్తున్నారు. ఇప్పటికే శరవేగంగా షూటింగ్ జరుపుకొంటున్న ఈ సినిమాలో 'యానిమల్' ఫేమ్ రణ్ బీర్ కపూర్ రాముడిగా నటిస్తుండగా, సాయిపల్లవి సీత పాత్ర చేస్తోంది. 'కేజీఎఫ్' యష్ రావణుడిగా నటిస్తున్నాడు. మిగిలిన పాత్రల కోసం పలు పేర్లు వినిపిస్తున్నప్పటికీ ఎవరిని ఫైనల్ చేశారనేది ఇంకా బయటపెట్టలేదు. ప్రస్తుతానికైతే మండోదరి పాత్ర కోసం కాజల్ అగర్వాల్‌ని తీసుకున్నారనే రూమర్స్ వినిపిస్తున్నాయి. రావణుడి భార్య పేరు మండోదరి. రామాయణ్ మూవీలో ఈమె పాత్రకు చాలా తక్కువ ప్రాధాన్యం ఉండొచ్చు. మరి కాజల్ నిజంగా ఒప్పుకొందా? లేదంటే ఇవి రూమర్స్ మాత్రమేనా అనేది మరికొన్ని రోజుల్లో క్లారిటీ రావొచ్చు. నితీష్ తివారీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను రెండు భాగాలుగా రిలీజ్ చేయబోతున్నారు. 2026 దీపావళికి తొలి భాగం, 2027లో రెండో భాగం రిలీజ్ చేయబోతున్నారు. మరి ఈ మూవీతో దర్శకనిర్మాతలు ఎలాంటి సంచలనాలు సృష్టిస్తారో చూడాలి?

## హాయ్.. తారక్, మే 20న నువ్వు ఊహించలేని గిఫ్ట్ ఉంది: హృతిక్

జూనియర్ ఎన్టీఆర్, హృతిక్ రోషన్ నటిస్తున్న 'వార్ 2' సినిమా కోసం దేశవ్యాప్తంగా సినీ అభిమానులు ఎదురుచూస్తున్నారు. వారందరి కోసం తాజాగా హృతిక్ ఒక శుభవార్త చెప్పారు. టీజర్ ఎప్పుడు విడుదలౌతుందో ప్రకటించారు. పాన్ ఇండియా రేంజ్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో ఆదిత్యా చోప్రా ఈ మూవీని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా కియారా అద్వానీ నటిస్తున్నారు. తన పాత్రకూ కొన్ని యాక్షన్ సీక్వెన్స్‌లు ఉన్నాయని తెలిసింది. హృతిక్ రోషన్(Hrithik Roshan) తాజాగా తారక్‌ను ట్యాగ్ చేస్తూ సోషల్‌మీడియాలో ఒక పోస్ట్ షేర్ చేశారు. 'హాయ్.. తారక్ ఈ సంవత్సరం మే 20న ప్రత్యేకత ఏంటో మీకు తెలుసా..? సిద్ధంగా ఉండు నువ్వు ఊహించలేని గిఫ్ట్ ఉంటుంది' అని ఆయన పంచుకున్నారు. ఈ సారాంశాన్ని చూస్తే వార్2 టీజర్ ఆరోజున విడుదల కావచ్చని తెలుస్తోంది. మే 20 ఎన్టీఆర్ పుట్టినరోజు ఉంది. కాబట్టి ఆరోజు ఈ సినిమా నుంచి తప్పకుండా టీజర్ విడుదల కా 2019లో హిట్‌గా నిలిచిన హిందీ చిత్రం ‘వార్’కు సీక్వెల్‌గా ‘వార్ 2’ తెరకెక్కుతుంది. ఈ సినిమాపై టాలీవుడ్‌తో పాటు బాలీవుడ్ అభిమానులు కూడా భారీ అంచనాలు పెట్టుకున్నారు. దాదాపు షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. ఆగస్టు 14న విడుదల కానుంది. ఈ సినిమాలో ఎన్టీఆర్ రా ఏజెంట్‌గా నటించనున్నారని బాలీవుడ్ మీడియా పేర్కొంది. గతంలో షారుక్‌ఖాన్, సల్మాన్‌ఖాన్, హృతిక్ రోషన్‌లు రా ఏజెంట్ పాత్రలలో నటించి అక్కడ మంచి గుర్తింపుతో పాటు విజయాన్ని అందుకున్నారు. అయితే, వార్2లో వీటన్నింటి కంటే భిన్నంగా ఎన్టీఆర్ పాత్ర ఉందని తెలుస్తోంది. ఆపై ఈ మూవీలో హృతిక్ ఎన్టీఆర్‌లపై అదిరిపోయే సాంగ్‌ను ప్లాన్ చేశారట . దాదాపు 500మంది డ్యాన్సర్లుతో వారు స్టెప్పులేశారట.





# క్రీడా వార్తలు SPORTS NEWS





## ఇక్కడి నుంచి పో..: సహనం కోల్పోయిన స్టార్క్..

ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్, ఢిల్లీ క్యాపిటల్స్ పేసర్ మిచెల్ స్టార్క్ సహనం కోల్పోయాడు. ‘‘ఇక్కడి నుంచి వెళ్లిపో’’ అంటూ అభిమానిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఇందుకు సంబంధించిన వీడియో తాజాగా వెలుగులోకి వచ్చింది. కాగా ఐపీఎల్2025 మెగా వేలంలో భాగంగా ఢిల్లీ స్టార్క్‌ను రూ. 11. 75 కోట్ల భారీ ధరకు దక్కించుకుంది. ఈ క్రమంలో ఈ సీజన్‌లో ఢిల్లీ తరఫున పదకొండు మ్యాచ్‌లు ఆడి పద్నాలుగు వికెట్లు పడగొట్టాడు స్టార్క్. చివరగా పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్ సందర్భంగా అతడు బరిలోకి దిగాడు. అయితే, భారత్ పాకిస్తాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో ధర్మశాలలో బ్లాక్ అవుట్ (విద్యుత్ సరఫరా నిలిపివేయడం) విధించడంతో పంజాబ్ ఢిల్లీ మ్యాచ్ అర్ధంతరంగా ఆగిపోయిన విషయం తెలిసిందే.

**భార్య అలిసా హేలీతో కలిసి**

ఈ నేపథ్యంలో బీసీసీఐ ఆటగాళ్లను వెంటనే సురక్షిత ప్రాంతానికి తరలించి.. ఆపై కట్టుదిట్టమైన భద్రత నడుమ ఢిల్లీకి చేర్చింది. ఈ పరిణామాలతో తీవ్ర భయాందోళనకు లోనైన స్టార్క్, అతడి భార్య అలిసా హేలీ ఢిల్లీకి చేరుకుని.. వెంటనే స్వదేశానికి పయనమయ్యారు.



**ఇక్కడి నుంచి పో..**



ఈ క్రమంలో ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ఓ వ్యక్తి స్టార్క్ దగ్గరగా వెళ్లి వీడియో తీసే ప్రయత్నం చేశాడు. దీంతో అతడు పక్కకు వెళ్లిపో అంటూ సైగ చేశాడు. అయితే, కాసేపటి తర్వాత సదరు వ్యక్తి మరోసారి స్టార్క్ దగ్గరికి వెళ్లి పలకరించాడు. దీంతో కోపోద్రిక్తుడైన ఆసీస్ బౌలర్.. ‘‘పో.. పో.. ఇక్కడి నుంచి దూరంగా వెళ్లిపో’’ అన్నట్లుగా విసుక్కున్నాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ క్రమంలో చాలా మంది స్టార్క్‌కు మద్దతుగా నిలుస్తున్నారు. అసలే భయపడిన వాడిని మరింత భయపెట్టడం సరికాదంటూ సెటైర్లు వేస్తుండగా... మరికొందరు మాత్రం స్టార్క్ అంతలా విసుక్కోవాల్సిన అవసరం లేదని.. ఏదేమైనా ఒకరి గోప్యతకు భంగం వాటిల్లేలా ప్రవర్తించడం ఏమిటని సదరు వ్లాగర్‌కు చివాట్లు పెడుతున్నారు.

**మే 17 నుంచి తిరిగి ప్రారంభం**

ఇదిలా ఉంటే... మే 17 నుంచి ఐపీఎల్2025 తిరిగి ప్రారంభం కానుంది. అయితే, ఢిల్లీకి ఆడుతున్న ఆసీస్ స్టార్లు స్టార్క్, జేక్ ఫ్రేజర్‌మెగర్క్ తిరిగి ఇండియాకు వచ్చే సూచనలు కనిపించడం లేదు. ఇష్టమైతేనే భారత్‌కు తిరిగి వెళ్లవచ్చు అని క్రికెట్ ఆస్ట్రేలియా తమ ఆటగాళ్లకు సూచించగా.. స్వదేశంలోనే ఉండేందుకు వీరిద్దరు మొగ్గుచూపినట్లు తెలుస్తోంది. మరోవైపు.. ఢిల్లీకి లీగ్ దశలో ఇంకో మూడు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. ప్రస్తుతం పదకొండు మ్యాచ్‌లు పూర్తి చేసుకుని 13 పాయింట్లతో పట్టికలో ఐదో స్థానంలో కొనసాగుతున్న అక్షర్ సేన.. ప్లే ఆఫ్స్‌నకు గురిపెట్టింది. అయితే, స్టార్క్, మెగర్క్ వంటి కీలక ఆటగాళ్లు లేకపోవడం తీవ్ర ప్రభావం చూపనుంది.

## ఢిల్లీ క్యాపిటల్స్‌కు గుడ్ న్యూస్
### స్టార్ ప్లేయర్ రాకకు లైన్ క్లియర్!

ఐపీఎల్ 2025 పునఃప్రారం వేళ ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఓ గుడ్ న్యూస్ అందింది. ఐపీఎల్ మిగిలిన మ్యాచ్‌లో ఆడేందుకు ముస్తఫిజుర్ రెహ్మాన్‌కు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ (NOC) మంజూరు చేసినట్లు తెలుస్తోంది. అతడు శనివారం ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో చేరనున్నట్లు పలు రిపోర్ట్‌లు పేర్కొంటున్నాయి. కాగా ఈ ఏడాది ఐపీఎల్ సీజన్ వారం రోజులు వాయిదా పడడంతో చాలా మంది ఫారన్ ప్లేయర్లు తమ స్వదేశానికి వెళ్లిపోయారు. అయితే ఐపీఎల్ రీస్టార్ట్ అవుతుండడంతో కొంతమంది తిరిగి భారత్‌కు రావడానికి సిద్దపడితే, మరి కొంతమంది నిరాకరించారు. అందులో ఒకరు ఆస్ట్రేలియా యువ సంచలనం జేక్ ఫ్రెజర్ మెక్‌గర్క్. ఐపీఎల్ 16వ సీజన్‌లో మిగిలిన మ్యాచ్‌లకు తన అందుబాటులో ఉండడని మెక్‌గర్క్ ఢిల్లీ ఫ్రాంచైజీకి తెలియజేశాడు. ఈ క్రమంలో మెక్‌గర్క్ స్థానంలో బంగ్లాపేసర్ ముస్తఫిజుర్ రెహ్మాన్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ తీసుకుంది. అయితే ఇక్కడే అస్సలు ట్విస్ట్ చోటు చేసుకుంది. ముస్తఫిజుర్‌తో ఢిల్లీ ఒప్పందం కుదుర్చుకున్నప్పటికి అతడు యూఏఈతో టీ20 సిరీస్ ఆడేందుకు దుబాయ్‌కు పయనమయ్యాడు. యాదృచ్ఛికంగా యూఏఈబంగ్లా సిరీస్ కూడా మే 17 నుంచి ప్రారంభం కానుంది. దీంతో అతడు తిరిగి భారత్‌కు వస్తాడా లేదా అన్న సందిగ్ధం నెలకొంది. ఎట్టకేలకు బంగ్లా క్రికెట్ బోర్డు అతడికి ఎన్‌వోసీ మంజూరు చేయడంతో ఢిల్లీ అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఈ ఏడాది సీజన్‌లో మిగిలిన మ్యాచ్‌లకు ఢిల్లీ క్యాపిటల్స్ స్టార్ ప్లేయర్లు మిచెల్ స్టార్క్, ఫాఫ్ డుప్లెసిస్ సైతం దూరమయ్యారు. ఈ ఏడాది సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఇంకా మూడు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. ఈ మూడు మ్యాచ్‌లలోనూ ఢిల్లీ విజయం సాధిస్తే ఎటువంటి సమీకరణాలు అవసరం లేకుండా ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తోంది.

## నేనైతే వెళ్లేవాడిని కాదు.. మీరూ వెళ్లొద్దు: ఆసీస్ మాజీ క్రికెటర్

### పాంటింగ్ అలా.. ఇతడేమో ఇలా!


ఐపీఎల్2025 ప్లే ఆఫ్స్ దశకు చేరుకున్న వేళ అనుకోని విధంగా వారం పాటు వాయిదా పడింది. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత్ పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న వేళ భారత క్రికెట్ నియంత్రణ మండలి ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. అయితే, ప్రస్తుతం పరిస్థితులు చక్కబడటంతో లీగ్‌ను పునఃప్రారంభించేందుకు బోర్డు సిద్ధమైంది.

**కొందరు వచ్చేశారు**

ఇప్పటికే పది ఫ్రాంచైజీలకు తమ ఆటగాళ్లందరినీ ఒకే చోట చేర్చాల్సిందిగా ఆదేశించిన బోర్డు.. శనివారం (మే 17) నుంచి మ్యాచ్‌లు కొనసాగించనుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే కొంత మంది విదేశీ ఆటగాళ్లు భారత్‌కు చేరుకోగా.. మరికొంత మంది జాతీయ జట్టు విధుల దృష్ట్యా స్వదేశాల్లోనే ఉండిపోయారు. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ మిచెల్ జాన్సన్ ఐపీఎల్ ఆడే విదేశీ ఆటగాళ్లను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. ‘‘ఐపీఎల్ ఆడేందుకు తిరిగి ఇండియాకు వెళ్లాలా వద్దా అనే నిర్ణయాన్ని క్రికెట్ ఆస్ట్రేలియా ఆటగాళ్లకే వదిలివేసింది.

**నేనైతే ‘నో’ చెప్పేవాడిని**

నిజానికి మధ్యలోనే ఇలా లీగ్‌ను వదిలివేయడం నిరాశకు గురిచేస్తుంది. ప్రొఫెషనల్‌గా, ఆర్థికంగా ఒక్కోసారి ఎదురుదెబ్బలు తగులుతాయి. అయితే, అన్నింటికంటే భద్రతే ముఖ్యం. ఒకవేళ నేనే గనుక వారి స్థానంలో ఉండి ఉంటే.. ఇండియాకు వెళ్లి లీగ్ పూర్తి చేయాలని ఆదేశించినా.. కచ్చితంగా ‘నో’ చెప్పేవాడిని. ఎందుకంటే నా వరకు చెక్కుల కంటే కూడా ప్రాణాలు ముఖ్యమైనవి. అయితే, ఇది కేవలం నా వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే. ఐపీఎల్ ఒక్కటనే కాదు.. పాకిస్తాన్ సూపర్ లీగ్ ఆడేందుకు కూడా ఆటగాళ్లు అక్కడికి వెళ్లాల్సిన అవసరం లేదనే నేను భావిస్తున్నా’’ అని మిచెల్ జాన్సన్ ది వెస్ట్రన్ ఆస్ట్రేలియన్‌కు రాసిన కాలమ్‌లో పేర్కొన్నాడు.



**సౌతాఫ్రికా క్రికెట్ బోర్డు ఒప్పుకోవడానికి కారణం అదే**

అదే విధంగా.. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్2025 ఫైనల్ గురించి ప్రస్తావిస్తూ.. ‘‘జూన్ 3న ఐపీఎల్ ఫైనల్ జరుగుతుంది. ఆ తర్వాత వారం రోజులకే లార్డ్స్‌లో డబ్ల్యూటీసీ ఫైనల్ ఉంది. కాబట్టి ఈ మెగా మ్యాచ్‌కు సన్నద్ధమయ్యే క్రమంలో ఆటగాళ్లపై తీవ్రమైన ఒత్తిడి నెలకొంటుంది’’ అని మిచెల్ జాన్సన్ పేర్కొన్నాడు. అయితే, బీసీసీఐతో సౌతాఫ్రికా క్రికెట్ బోర్డుకు ఉన్న ఆర్థిక సంబంధాల దృష్ట్యా ప్రొటీస్ ఆటగాళ్లంతా తిరిగి ఐపీఎల్‌లో పాల్గొంటారని జాన్సన్ అభిప్రాయపడ్డాడు. కాగా ఐపీఎల్ ఫ్రాంచైజీల సారథ్యంలోనే సౌతాఫ్రికా టీ20 లీగ్ జరుగుతున్న విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే.. ధర్మశాలలో పంజాబ్ కింగ్స్ ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య మ్యాచ్ అర్ధంతరంగా ఆగిపోయిన విషయం తెలిసిందే.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com